## తిరుమల,తిరుపతి స్థానిక కోటా దర్శనాల్లో మార్పు

తిరుమల : ప్రతినెలా మొదటి మంగళవారం తిరుమల , తిరుపతి స్థానికులకు టీటీడీ కల్పిస్తున్న స్థానిక కోటా దర్శనాల్లో స్వల్ప మార్పు చేశారు. ఈనెల 4న మొదటి మంగళవారం రథసప్తమి పర్వదినం రావడంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండో మంగళవారానికి స్థానిక కోటా దర్శనాలను మార్పు చేశారు. ఈ మేరకు తిరుమలలోని బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్, తిరుపతిలోని మహతీ ఆడిటోరియంలో 9వ తేది ఆదివారం టోకెన్లను జారీ చేయనున్నట్లు అధికారు లు వివరించారు. స్థానికులు ఈ మార్పును గమనించి టోకెన్లు పొందాలని టీటీడీ అధికారులు కోరారు.

శ్రీవారి హుండీకి రూ. 2.52 కోట్లు ఆదాయం

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు కేవలం రెండు కంపార్టుమెంట్లలో మాత్రమే వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం అవుతుందని అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 51,818 మంది భక్తులు దర్శించుకోగా 19,023 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 2.52 కోట్లు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :293 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది:ఆదివారం 02-02-2025 | పేజీలు:4 వెల: 2.00


# రూ. 50,65,345 కోట్లతో కేంద్ర బడ్జెట్..



న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ మొత్తంగా రూ. 50,65,345 కోట్ల కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం రెవెన్యూ వసూళ్లను రూ. 34,20,409 కోట్లుగా అంచనా వేశారు. మూలధన వసూళ్లలో రూ. 16,44,936 కోట్లుగా ఉండబోతున్నట్లు తెలిపారు. 2025-26 బడ్జెట్‌లో అత్యధికంగా రక్షణ రంగానికి నిధులు కేటాయించారు. ఆ తర్వాత గ్రామీణాభివృద్ధికి నిధులు కేటాయించారు. శాస్త్ర, సాంకేతిక రంగానికి రూ. 55 వేల కోట్లు కేటాయించినట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు

కొత్త పన్ను విధానం కింద రూ.12 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న వ్యక్తులు ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025 బడ్జెట్ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. పన్ను వ్యవస్థను సరళతరం చేయడానికి, పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కలిగించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు చెప్పారు. కొత్త పన్ను విధానం ఆకర్షణీయమైన పన్ను రేట్లను అందిస్తుంది. వివిధ మినహాయింపులు, మినహాయింపుల అవసరాన్ని తొలగిస్తుందని చెప్పారు.

ఇందులోని కీలక ఫీచర్లు ఇవే..కొత్త పన్ను విధానం ప్రకారం.. వార్షికంగా రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్న వ్యక్తులు ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. పాత విధానంతో పోలిస్తే కొత్త విధానంలో తక్కువ పన్ను రేట్లు విధిస్తారు. ఉదాహరణకు, రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల మధ్య ఆదాయంపై 15 శాతం, రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల మధ్య ఆదాయంపై 20 శాతం పన్ను ఉంది. వేతన ఉద్యోగులు రూ.75,000 స్టాండర్డ్ డిడక్షన్ పొందవచ్చు. ఇది వారి పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని తగ్గిస్తుంది. రూ.12 లక్షల ఆదాయం ఉన్నవారికి పన్ను రూపంలో రూ.80 వేలు ఆదా అవుతుంది. ఇతర శ్లాబుల్లో కూడా మార్పులు ఉంటాయని నిర్మలమ్మ ప్రకటించారు. రూ.25 లక్షల ఆదాయం ఉన్నవారికి రూ.1.10 లక్షలు ఆదా అవుతుంది.

వేతన జీవులకు భారీ ఊరట..

2025-26 ఎ ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వృద్ధి మందగించినా భారత్ మెరుగైన పనితీరు సాధించిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి చెందిన బడ్జెట్‌ను (%ఖఅఆశీఅ దీబఎస్త్రవ్%)ను నిర్మలమ్మ ఇవాళ పార్లమెంట్ ముందు ఉంచారు. ఉదయం 11 గంటలకు సమావేశాలు ప్రారంభం కాగానే లోక్‌సభలో బడ్జెట్‌పై ప్రసంగం ప్రారంభించారు. పేదలు, యువత, రైతులు, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యంతో ఈ బడ్జెట్‌ను రూపకల్పన చేసినట్లు చెప్పారు. గత పదేళ్లలో సాధించిన అభివృద్ధే తమ స్ఫూర్తి, మార్గదర్శి అని తెలిపారు. %ఇక ఈ బడ్జెట్‌లో వేతన జీవులకు భారీ ఊరట కల్పించారు. రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు కల్పించారు. రూ.12 లక్షలకు మించిన ఆదాయం ఉన్నవారికి శ్లాబులవారీగా పన్నులను నిర్ణయించారు. రూ.20లక్షల నుంచి రూ.24 లక్షల వరకు 25 శాతం పన్నుగా నిర్ణయించారు. రూ.16 లక్షల నుంచి 20లక్షల్లోపు ఆదాయంపై 20 శాతం పన్నుగా నిర్ణయించారు. ఇక కేంద్రంలో ప్రధాన మిత్రపక్ష రాష్ట్రమైన బీహార్‌కు వరాల జల్లు కురిపించారు.

# కేజ్రీవాల్ కు భారీ షాక్.. ఎనిమిది మంది ఆప్ ఎమ్మెల్యేల రాజీనామా

న్యూఢిల్లీ, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఆమ్ ఆద్మీ పార్టీకి పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. టిక్కెట్లు రాకపోవడంతో 8 మంది ఆప్ ఎమ్మెల్యేలు పార్టీకి రాజీనామా చేశారు. పాలం సీటు ఎమ్మెల్యే భావన గౌర్, ఇ త్రిలోక్‌పురి ఎమ్మెల్యే రోహిత్ మెహ్రౌలియా, జనక్‌పురి నుంచి రాజేష్ రిషి, కస్తూర్బా నగర్ నుంచి మదన్‌లాల్, బిజ్వాసన్ నుంచి బిఎస్ జూన్, ఆదర్శ్ నగర్ నుంచి పవన్ శర్మ, మాదిపూర్ నుంచి గిరీష్ సోని, మెహ్రౌలి నుంచి నరేష్ యాదవ్ పార్టీతో సంబంధాలు తెంచుకున్నారు. ఈసారి ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ భిన్నమైన వ్యూహాన్ని అనుసరించి తన సిట్టింగ్ ఎమ్మెల్యేలలో చాలా మంది టిక్కెట్లను తగ్గించుకుంది. దీనితో పాటు పార్టీ కొత్త ముఖాలకు అవకాశం ఇచ్చి వారిని రంగంలోకి దించింది. దీని తరువాత కోపంగా ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పార్టీకి రాజీనామా చేశారు. పార్టీకి రాజీనామా చేసిన తర్వాత, పాలం సీటు ఎమ్మెల్యే భావన గౌర్ మాట్లాడుతూ.. "నాకు అస్సలు కోపం లేదు. నాకు వాస్తవికత బాగా తెలుసు. నేను ఎప్పటికీ ఎమ్మెల్యేగానే ఉంటానని చరిత్రలో కూడా రాయలేదు. నేను హర్యానా లాంటి రాష్ట్రం నుండి వచ్చి ఢిల్లీలో స్థిరపడ్డాను. నేను ఐదు సంవత్సరాలుగా ఢిల్లీలో కౌన్సిలర్‌గా ఉన్నాను. నేను పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నాను. నేను పాలం ప్రజలకు నిజాయితీగా, విధేయతతో సేవ చేసాను, అందుకే నాకు దాని గురించి ఎటువంటి విచారం లేదు." అన్నారు. భావన గౌర్ ఇంకా మాట్లాడుతూ.. "ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భవించిన భావజాలానికి నేను చింతిస్తున్నాను. నేడు ఆ పార్టీ కన్వీనర్ తన చుట్టూ ఉన్నట్లు వంటి వారు ఏమి చూపిస్తారో మాత్రమే చూడగలిగే అద్దాలు మాత్రమే పెట్టుకున్నాడు. కాబట్టి నాకు వాళ్ళ మీద కోప ంగా ఉంది. ఇది ప్రజాస్వామ్యం, ప్రతి ఒక్కరూ టికెట్ అడగవచ్చు, కానీ పార్టీ ఏదైనా పని చేసినప్పుడు, దాని సంస్థ దానితో ముడిపడి ఉంటుంది అని కూడా ఆయన అన్నారు. సంస్థతో సంబంధం ఉన్న ప్రతి వ్యక్తి తన కోరికను వ్యక్తపరచవచ్చు. ఆయన టికెట్ అడగవచ్చు, కౌన్సిలర్ కావచ్చు, ఎమ్మెల్యే కావచ్చు." అని అన్నారు.

బీజేపీని తప్పుపట్టిన ఎమ్మెల్యేలు

ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు ఎన్నికలకు ముందే రాజీనామా




చేశారు. ఈ ఎన్నికల్లో ఆప్ తన ఎమ్మెల్యేలలో చాలా మంది టిక్కెట్లను తగ్గించింది. ఆ తర్వాత 8 మంది ఎమ్మెల్యేలు పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. ఈసారి ఆప్ తన కిరారి ఎమ్మెల్యే టికెట్‌ను రద్దు చేసి, బిజెపి నుండి పార్టీలో చేరిన అనిల్ ఝాకు టికెట్ ఇచ్చింది. దీని తరువాత టికెట్ రాకపోవడంతో ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంపై ఆప్ కిరారి ఎమ్మెల్యే రితురాజ్ గోవింద్ మాట్లాడుతూ.. "గత కొన్ని వారాలలో బిజెపి నన్ను చాలాసార్లు సంప్రదించింది. వారు నాకు చాలా వస్తువులు ఇచ్చి నన్ను ఆకర్షించడానికి ప్రయత్నించారు. కానీ నేను వాటిని తిరస్కరించాను. అందరూ కాదు అని అన్నారు అత్యాశగలవాడు.. అందరినీ కొనలేడు. కేజ్రీవాల్ నాలాంటి సామాన్యుడికి రెండుసార్లు టికెట్ ఇచ్చారు. మన సహోద్యోగులలో కొందరు ఇప్పుడు బిజెపి ప్రభావం వల్ల ఇలా చేస్తున్నారు. చరిత్ర వారిని ఎప్పటికీ క్షమించదు." అని అన్నారు. తిమార్‌పూర్ నుండి దిలీప్ పాండే టికెట్‌ను రద్దు చేసి సురేంద్ర పాల్ సింగ్ బిట్టుకు ఇచ్చారు. దీని తరువాత టిక్కెట్లు రాకపోవడంతో ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఆప్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసినప్పుడు, తిమార్‌పూర్ ఎమ్మెల్యే దిలీప్ పాండే కూడా సోషల్ మీడియా హ్యాండిల్ Xలో పోస్ట్ చేశారు. "నేను ఆప్ లోనే ఉన్నాను, ఆప్ లోనే ఉంటాను, అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలో ఢిల్లీకి సేవ చేయడం నా అతిపెద్ద విధుల్లో ఒకటి" అని ఆయన అన్నారు.

# మౌనంగా ఉండే ఆ ఇద్దరు అధినేతలు ఒకే రోజు మాట్లాడటమా?

హైదరాబాద్,యాధృచ్ఛికం కం కాకతాళీయంగా అనూహ్య పరిణామానికి.. రాజకీయ కల కలానికి తెర తీశారు ఇద్దరు రాజకీయ అధినేతలు. ఈ ఇద్దరికి చాలానే సారూప్యతలున్నాయి. అదే సమయంలో ఆ ఇద్దరు ఉప్పు.. నిప్పుగా ఉంటారు. తరచి చూస్తే.. ఇద్దరి వ్యవహారశైలిలోనూ ఒకలాంటి అహంకారం కనిపిస్తూ ఉంటుంది. ఆ ఇద్దరే.. కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ.. మరొకరు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. సిత్రంగా ఈ ఇద్దరు నేతలు చేతిలో అధికారం ఉన్నప్పుడే కాదు.. అధికారం లేనప్పుడు కొందరికి మాత్రమే అందుబాటులో ఉంటారు. ప్రజలకు దూరంగా ఉంటూ.. తాము అనుకున్నప్పుడు వెనుకా ముందు చూడకుండా వచ్చేసి.. తాము చెప్పాల్సింది చెప్పేసి.. తమ దారిన తాము వెళ్లిపోతుంటారు. తాజాగా అలాంటి పనే చేశారు ఈ ఇద్దరు అధినేతలు. అసెంబ్లీ ఎన్నికల్లో దారుణ ఫలితాల్ని చవిచూసి.. విపక్ష నేతగా వ్యవహరిస్తున్నప్పటికి.. ప్రజల కంటే తనకు నచ్చిన వ్యవసాయం మీద ఫోకస్ చేసి.. తన దైన టైం కోసం ఫాంహౌస్ లో వెయిట్ చేయటం కేసీఆర్ లో కనిపిస్తూ ఉంటుంది. ఇక.. సోనియా గాంధీ విషయానికి వస్తే గడిచిన పదేళుగా అధికారానికి దూరంగా ఉంటూ.. మరెంత కాలం ఉండాలో అర్థంకాని అయోమయ స్థితిలో ఆమె ఉన్నారు. ప్రజల్లోకి చురుగ్గా దూసుకెళ్లే విషయంలో ఆమె ఎలా ఉంటారన్నది తెలిసిందే. రిమోట్ కంట్రోల్ ను కంట్రోల్ చేయటంలో ఉండే టాలెంట్.. ప్రజలకు మేలు చేసే అంశాల విషయంలో మాత్రం ఆమె



తన సత్తా చాటలేదనే చెప్పాలి. తాను కొడితే దెబ్బ బలంగా ఉంటుందంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద చేసిన సంచలన వ్యాఖ్యలతో హాట్ టాపిక్ గా మారారు కేసీఆర్. అదే సమయంలో.. రాష్ట్రపతి బాగా అలిసిపోయారంటూ సంచలన వ్యాఖ్యలతో అందరూ తనవైపు చూసేలా చేశారు సోనియాగాంధీ. ఈ ఇద్దరు అధినేతలు కొంతకాలంగా కామ్ గా ఉంటున్న సంగతి తెలిసిందే. రాజకీయ పరంగా ఉప్పునిప్పుగా ఉండే ఈ ఇద్దరు అధినేతలు.. ఒకే రోజు ఒకే తరహాలో మాట్లాడి రాజకీయ సంచలనానికి తెర తీయటం ఆసక్తికరంగా మారిందని చెప్పక తప్పదు.

# ఫిరాయిపులపై కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు



కేరళ: ఫిరాయింపు రాజకీయాలపై కేరళ ఉన్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఒక పార్టీపై గెలిచి.. మరో పార్టీలోకి వెళ్లాలనుకుంటే గనుక ముందుగా తమ పదవులకు రాజీనామా చేయాలని రాజకీయ నేతలకు సూచించింది. కూథట్టుకులమ్ మున్సిపల్ కౌన్సిలర్ కళా రాజును అపహరించి, దాడి చేసిన కేసులో ఐదుగురికి ఆ రాష్ట్ర హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా.. జస్టిస్ పివి కున్హికృష్ణన్ ఫిరాయింపులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రజాప్రతినిధులు వారిని ఎన్నుకున్న ప్రజల అభీష్టానికి కట్టుబడి ఉండాల్సిందేనని వ్యాఖ్యానించారాయన. "ఒక ప్రతినిధి రాజకీయ విధేయతను మార్చుకోవాలనుకుంటే(పార్టీ మారాలనుకుంటే).. ఆ వ్యక్తి మొదట రాజీనామా చేయాలి. ఇది ప్రజాస్వామ్యంలో నైతిక కోణం. అప్పుడే ఓటర్ల నమ్మకాన్ని ఏకపక్షంగా విచ్ఛిన్నం చేయకుండా ఉంటారు. అలా జరగకుంటే.. ప్రజల ప్రజల అభీష్టాన్ని అవమానించడమే అవుతుంది. అలాంటి ప్రజాప్రతినిధిని తర్వాతి ఎన్నికల్లో ఓడించం ద్వారా ప్రజలు తమ సత్తా చాటగలరు. ప్రజాస్వామ్యానికి ఉన్న అందం అదే కూడా" అని న్యాయమూర్తి అన్నారు. ప్రస్తుత కేసులో.. ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యను పరిష్కరించుకోకుండా ఇరు వర్గాలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ప్రజాప్రతినిధిని ఓడించాలంటే అది ఎన్నికల ద్వారానే.. హింస ద్వారా కాదు అని కోర్టు వ్యాఖ్యానించింది. తెలంగాణలో బీఆర్ఎస్ మీద నెగ్గిన ఎమ్మెల్యేలు.. కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన వ్యహారం సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగిన సంగతి తెలిసిందే. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలకు ఇంకెంత టైం కావాలంటూ తెలంగాణ స్పీకర్‌పై సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. అదే సమయంలో ఇటు.. కేరళ హైకోర్టు కూడా ఫిరాయింపులపై ఈ తరహా వ్యాఖ్యలు చేయడం విశేషం.

కేసు ఏంటంటే..

సీపీఎం కౌన్సిలర్‌గా నెగ్గిన కళా రాజు ఆ తర్వాత యూడీఎఫ్‌లో చేరారు. అయితే అవిశ్వాస తీర్మానం వేళ.. ఓటేయకుండా తనను అడ్డుకున్నారని, బలవంతంగా ఎత్తుకెళ్లి మరీ దాడికి పాల్పడ్డారని సీపీఎం నేతల మీద ఆరోపణలకు దిగారామె. ఆ ఆరోపణలను సీపీఎం ఖండించింది కూడా. అయితే ఈ ఘటనపై కళా రాజు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో 45 మందిపై కేసు నమోదు చేశారు. వాళ్లలో ఐదుగురు ముందస్తు బెయిల్ కోరగా.. షరతులతో మంజూరు చేసింది కేరళ హైకోర్టు.

# కేజ్రీవాల్ గెలిస్తే ఆ రెండు కూటములకూ సవాలేనా ?



న్యూఢిల్లీ,ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో ఆప్ చావో రేవో అన్నట్లుగా పోరాడుతోంది. ఈసారి గెలిచి వరసగా నాలుగో సారి సీఎం కావాలని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ భావిస్తున్నారు. ఆయన తనదైన ఎన్నికల వ్యూహాలతో దూకుడు చేస్తున్నారు. ఆప్ కి విజయమో వీర స్వర్గమో అన్నట్లుగా కేజ్రీవాల్ కాంపెయిన్ సాగుతోంది. ఇక చూస్తే బీజేపీ ఏ మాత్రం తీసి పోవడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కాబట్టి అన్నింటినీ సిద్ధం చేసుకుని మరీ ఢిల్లీలో యుద్ధం చేస్తోంది. బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు ముఖ్యమంత్రులు అంతా కూడా మోహరిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సైతం ప్రత్యేక దృష్టి పెట్టారు. అదే విధంగా మిత్ర పక్షాల నేతలను రంగంలోకి దించుతున్నారు. నిజానికి చూస్తే ఆప్ ఓటమి చెందాలి. కానీ బలంగా గ్రౌండ్ లెవెల్ లో ఇప్పటికీ ఆ పార్టీ ఉందని పోలింగ్ కి దగ్గర పడే కొద్దీ విజయావకాశాలు పెరుగుతున్నాయని అంటున్నారు. దానికి కారణం ఆప్ గెలిస్తే ముఖ్యమంత్రి ఎవరు అన్నది అందరికీ తెలుసు. అదే బీజేపీ గెలిస్తే సీఎం ఎవరు అవుతారో కూడా తెలియదు. కాషాయం పార్టీకి ఇది పెద్ద మైనస్ గా మారుతోంది. అంతే కాదు ఢిల్లీలో ఉన్న ఉన్నత వర్గాలు మధ్యతరగతి వర్గాలు ఇపుడు ఆప్ దిశగా పోలరైజ్ అవుతున్నారు అన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. ఆప్ తన పాలనలో తప్పులు చేసి ఉండవచ్చు కానీ మెరుగైన పాలన అందించింది అన్నది ఈ వర్గాల భావనగా ఉంది. పైగా ఢిల్లీ ఓటర్లు ప్రతీ సారీ విలక్షణమైన తీర్పుని ఇస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా బీజేపీని గెలిపిస్తున్నారు ఏడు ఎంపీ సీట్లు ఉంటే అన్నీ కమలానికి ఇస్తున్నారు. అదే అసెంబ్లీ ఎన్నికలకు వస్తే మాత్రం ఆప్ కే పట్టం కడుతున్నారు. ఈసారి కూడా వారు ఆ ఆనవాయితీనే కొనసాగిస్తారు అని అంటున్నారు. మరో వైపు చూస్తే కాంగ్రెస్ పోటీ వల్ల ఆప్ కి నష్టం అని మొదట్లో వినిపించినా ఓటర్ల వివేచన ముందు కాంగ్రెస్ వీగిపోతోంది అని అంటున్నారు. దాంతో పోటీ ఆప్ బీజేపీల మధ్య ముఖాముఖీగా మారుతోంది అని అంటున్నారు. ఈ పరిస్థితి కూడా ఆప్ కి అతి పెద్ద అడ్వాంటేజ్ గా మారుతోది. అదే విధంగా ఇండియా కూటమి మిత్రులు అయిన సమాజ్ వాదీ పార్టీ ఎన్సీపీ, తృణమూల్ కాంగ్రెస్ వంటివి ఆప్ కి మద్దతుగా నిలబడడంతో పెద్ద ఎత్తున బడుగు వర్గాలు ఇతర అణగారిన వర్గాల మద్దతు ఆప్ కి దక్కుతోంది. ఇక ఎన్నికలు మరి కొద్ది రోజులకు వచ్చేశాయంనగా వస్తున్న సర్వేలు సైతం ఆప్ కి ఈసారి సీట్లు తగ్గినా అధికారం మాత్రం దక్కుతుందని తేల్చేస్తున్నాయి. కనీసంగా 38 నుంచి 40 దాకా సీట్లు ఆప్ కి వస్తాయని బీజేపీ గతసరి వచ్చిన ఆరేడు సీట్ల నుంచి నాలుగింతలు పెంచుకుంటుంది తప్ప అధికారానికి మాత్రం దూరంగానే ఉంటుందని అంటున్నాయి. ఇక ఈ సర్వేలు కనుక నిజమై ఆప్ మరోసారి ఢిల్లీ పీఠమెక్కితే రెండు జాతీయ కూటములకు ఒక సవాల్ గా మారుతుందని అంటున్నారు. ఇండియా కూటమిలో అమాంతం కేజ్రీవాల్ ప్రాధాన్యత పెరిగిపోతుందని విశ్లేషిస్తున్నారు. అదే విధంగా కాంగ్రెస్ కూడా ప్రత్యర్థిగా పోటీ పడడంతో మిత్రులు అంతా కలసి ఆ పార్టీని టార్గెట్ చేసి నాయకత్వ స్థానం అందుకున్నా అందుకుంటారు అంటున్నారు. అదే విధంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయేను సవాల్ చేసేలా కేజ్రీవాల్ మళ్ళీ పూర్తి బలవంతుడిగా మారుతారు అని అంటున్నారు. అది ఇండియా కూటమిని ఇంకా బలోపేతం చేస్తుందని చెబుతున్నారు. మొత్తానికి బీజేపీకి ఢిల్లీలో ఓటమి దక్కితే ఆ ప్రభావం బీహార్ ఎన్నికల మీద కూడా ఉంటుందని అంటున్నారు.

# త్వరలో ఎన్నికలు జరగనున్న బిహార్‌కు బడ్జెట్‌లో వరాల జల్లు..

న్యూఢిల్లీ, ప్రస్తుత బడ్జెట్‌లో ఎన్డీయే మిత్రపక్ష రాష్ట్రమైన బీహార్‌కు నరేంద్ర మోడీ ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. రాష్ట్రంలో మఖానా బోర్డు ఏర్పాటుతో పాటు నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులను సైతం ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. మఖానా ఉత్పత్తిని ప్రోత్సహించి రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికే రాష్ట్రంలో ప్రత్యేక మఖానా బోర్డును ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొనింది. అంతేకాదు మఖానా పండించే రైతులకు సాంకేతిక, ఆర్థిక సాయం కూడా అందించనున్నట్లు చెప్పుకొచ్చింది. ఈ నిర్ణయంతో రైతుల ఆదాయం భారీగా పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే, బీహార్ రాష్ట్రంలోని రైతులు చాలా కాలంగా మఖానాను పండిస్తున్నారు. దీని ఉత్పత్తిలో బీహార్ దేశంలోనే అతి పెద్ద కేంద్రంగా కొనసాగుతుంది. దేశంలో 90 శాతం మఖానా కేవలం బీహార్‌లోనే ఉత్పత్తి చేస్తున్నారు. నార్త్ బీహార్ ప్రాంతంలో అధికంగా ఈ మఖనాను పండిస్తారు. కానీ, దీన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.. తాజాగా ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యతో మఖానా పరిశ్రమకు మరింత ఊతమిచ్చినట్లైంది. అలాగే, రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో పాటు ఈ ఏడాది చివర్లో జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ గిఫ్ట్ ఇచ్చిందంటూ విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

బీహార్ కు కేంద్రం ఇచ్చిన ఏడు గిఫ్ట్స్..

1. మఖానా బోర్డు ఏర్పాటు
2. ఐఐటీ పాట్నా విస్తరించటం..



3. బీహార్‌లో నేషనల్ ఫుడ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు.
4. పశ్చిమ కోసి కెనాల్ పనులకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు..
5. బిహ్తా విమానాశ్రయం విస్తరణతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడి. 6. పాట్నా విమానాశ్రయం విస్తరణతో పాటు ఆధునిక సౌకర్యాల కల్పన.
7. బీహార్‌లో 3 కొత్త గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలను నిర్మించడానికి నిర్ణయం.. భాగల్‌పూర్, రాజ్‌గిర్‌తో పాటు సోన్‌పూర్‌లో ఈ విమానాశ్రయాలు

## భూభ్రమణాని వీక్షించగలం...

న్యూఢిల్లీ,భూభ్రమణానికి సంబంధించిన అద్భుతమైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. భారతీయ ఖగోళ శాస్త్రవేత్త డోర్జే అంగ్‌చుక్ లద్దాఖ్‌లో భూమి భ్రమిస్తున్న వీడియోను టైమ్‌లాప్స్‌లో బంధించారు. హాన్లేలోని ఇండియన్ ఆస్ట్రోనామికల్ అబ్జర్వేటరీలో ఇంజినీర్-ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న అంగ్‌చుక్.. 24 గంటల పాటు టైమ్‌లాప్స్‌ను ఉపయోగించి వీడియో తీశారు.

## సంపాదకీయం

ఆదివారం 02-02-2025

# అవార్డుల రాజకీయం !

గద్దర్ చుట్టూ కొత్త రాజకీయం మొదలయ్యింది. గద్దర్ నక్సలైట్ కనుక ఆయనక పద్మ అవార్డు ఎలా ఇస్తామన్నకేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలతో ఇప్పుడు సర్వత్రా చర్చలు..ఉప చర్చలు..విమర్శలు, ప్రతి విమర్శలు మొదలయ్యాయి. తాజాగా తెలంగాణ నుంచి ప్రముఖులు ఎవరికీ పద్మ అవార్డులు రాకపోవడం, దీనిపై సిఎం రేవంత్రెడ్డి తీవ్రంగా స్పందించడం..తిరిగి బండి సంజయ్ విమర్శలు చేయడం తో కథ మొదలయ్యింది. నిజానికిపద్మ అవార్డులే కాదు..ప్రతి ఒక్క విషయంపైనా ప్రజల్లో చర్చ జరగాలి. అనుయాయులకు నామినేటెడ్ రాజ్యసభ సభ్యత్వాలు, పద్మ అవార్డులు, భారతరత్నలు కూడా ఇచ్చేస్తున్నారు. అవార్డుకు ఎంపికైన వ్యక్తి అర్హుడా కాదా అన్నది చూడడం లేదు. గతంలో సచిన్ టెండుల్కర్‌కు భారతరత్న ఇచ్చారు. ఆయన దేశానికి ఏ రకంగా ఉపయోగ పడ్డాడో తెలియదు. తన సొంత కెరీర్, రికార్డుల కోసం మాత్రమే అతను క్రికెట్ ఆడాడు. సామాజికంగా బాధ్యతగా పెద్ద సేవలేవీ చేయలేదు. కానీ దేశానికి సేవ చేయడమే గాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థలో మూలస్తంభంగా నిలిచిన రతన్ టాటాకు మాత్రం మనం భారతరత్న ఇవ్వలేదు. ఆయన బతికి ఉన్నప్పుడే ఇచ్చివుంటే గౌరవించుకుని ఉన్నట్లుగా ఉండేది. పివి నరసింహారావుకు భారత రత్న ఇవ్వడంలో కాంగ్రెస్ చేసిన రాజకీయం అంతా ఇంతాకాదు. దేశాన్ని నిలబెట్టిన పివిని అవమానించిన కాంగ్రెస్, చివరకు భారతరత్న ఇవ్వకుండా మరింతగా అవమానిం చింది. అలాంటి కాంగ్రెస్ ఇప్పుడు రాజ్యాంగం పేరిట రాజకీయాలు చేస్తోంది. ఇక బిజెపి కూడా సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్‌ను రాజ్యసభకు పంపింది. అలాగే కాంగ్రెస్ తెలంగాణ నుంచి అభిషేక్ మనుసింఘ్వీని రాజ్యసభకు పంపింది. తెలంగాణ కోసం కొట్లాడిన ఎందరినో కాదని ఓ లాయర్‌కు అవకాశం ఇచ్చింది. ఎవరు అధికారంలో ఉన్నా నిజాయితీ లేకుండా పోయింది. అందుకు బిజెపి మినహాయింపు కాదని చెప్పాల్సిందే. ఇవన్నీ ఇలావుంటే తాజాగా పద్మ అవార్డుల పంచాయితీ వచ్చింది. తెలంగాణలో పద్మ అవార్డుల పంచాయితీ రచ్చ చేసింది. ఈ వ్యవహారంపై ఇటు కాంగ్రెస్..అటు బీజేపీ నేతలు తగ్గేదే లేదంటూ కౌంటర్లు విసురుతున్నారు. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వానిది..ముమ్మాటికి వివక్షే అని కాంగ్రెస్ పార్టీ మండిపడుతోంది. అటు బీజేపీ మాత్రం..జాబితా పంపించినంత మాత్రాన అనర్హులకు అవార్డులు ఇవ్వాలా అంటూ ప్రశ్నిస్తోంది..? ఇలా.. రిపబ్లిక్‌డే ముగిసినా.. తెలంగాణలో పద్మ అవార్డులపై రాజకీయ రచ్చమాత్రం చల్లారడం లేదు. ఈ వ్యవహారంపై రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు ఐదు అవార్డులు వచ్చినప్పుడు తెలంగాణకు కనీసం నాలుగు అవార్డులు కూడా ఇవ్వక పోవడం వివక్ష కాదా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు.. తెలంగాణ ప్రభుత్వ సిఫార్సులను కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరేటి వెంకన్న, జయధీర్ తిరుమలరావు పేర్లు.. పద్మ అవార్డుల కోసం పంపించారు. వీరి పేర్లను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. కానీ వీరిలో ఏ ఒక్కరి పేరును కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదన్నారు.. ఈ విషయంలో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కేంద్రానికి నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు. అయితే ఇందులో కనీసం చుక్కారామయ్య పేరును కూడా పరిశీలించకపోవడం, కవి అందెశ్రీ పేరును కూడా పరిశీలించకపోవడం దారుణంగానే చూడాలి. గద్దర విషయంలో కూడా బిజెపి అతిగా మాట్లాడడం మానితే మంచిది. గద్దరు ప్రజాకవి. నక్సలైట్ ఉద్యమం నుంచి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. అలా వచ్చిన వారిలో ప్రస్తుత మంత్రి సీతక్క కూడా ఉన్నారు. వారిని తక్కువ చేసి చూడడం, మాట్లాడడం మంచిది కాదు. పద్మ అవార్డుల విషయంలో జరిగిన వివక్ష క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. అయితే నక్సల్స్ భావజాలంతో ఎందరో బీజేపీ నేతలను చంపించిన గద్దర్‌లాంటి వ్యక్తులకు..పద్మ అవార్డులు ఎలా ఇస్తామని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. అలాంటి వ్యక్తులకు బరాబర్ అవార్డులు ఇవ్వమని స్పష్టం చేశారు. రాష్ట్రం ప్రభుత్వం పంపించిన పేర్లను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందన్న బండి.. అర్హులైన వారికే పద్మ అవార్డులు వస్తాయని తేల్చిచెప్పారు. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు..ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. మాజీ నక్సలైట్లకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వొచ్చు కానీ.. పద్మ అవార్డులు ఇవ్వడానికి పనికి రారా? అని ప్రశ్నలు సంధించారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ లాంటి వ్యక్తిని పద్మ అవార్డులకు ప్రతిపాదిస్తే తప్పా అని ప్రశ్నించారు. బీజేపీ భావజాలం ఉన్నవారికి మాత్రమే అవార్డులు ఇస్తారా?అని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ ప్రశ్నించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం గద్దర్ పోరాటం చేశారన్న చామల.. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని అన్నారు. గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ ఖండించారు... బుద్దిస్ట్ మీకు మావోయిస్టుగానే కనబడ్డారా? అని ప్రశ్నించారు. గద్దర్‌లోని తెలంగాణ ఉద్యమకారుడు, దళిత ప్రజా ఉద్యమకారుడు కనిపించలేదా? అని నిలదీశారు. గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు వ్యక్తిగతమా.. పార్టీ విధానమా? చెప్పాలని డిమాండ్ చేశారు అద్దంకి. అయితే.. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు బండి సంజయ్. భావజాలం వేరు మావోయిస్టుగా చేయడం వేరన్న బండి.. మావోయిస్టులతో ఈటలకు సంబంధం లేదని చెప్పారు. ప్రభుత్వం ఇస్తామంటున్న గద్దర్ అవార్డులను బీజేపీ వాళ్లు తీసుకోరని స్పష్టం చేశారు. అటు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కూడా పద్మ అవార్డులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో సత్సంబంధాలు ఉన్న వారికే కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇచ్చిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిరంజీవికి ఇస్తే, ఇప్పుడు బీజేపీ బాలకృష్ణకి ఇచ్చిందని విమర్శించారు. గద్దర్‌కు, ఎల్టీటీఈకి పెద్దతేడా లేదంటూ మరో బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పలు విధానాలపై ఇప్పటికే మండిపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా యూజీసీ, పద్మ అవార్డుల అంశంలోనూ మోదీ సర్కారు తీరును తప్పుబడుతోంది. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. అయితే అవార్డుల ఎంపిక ఖచ్చితంగ ఆపారదర్శకంగానే సాగాలి. అర్హులకే అవార్డులు కానీ, రాజ్యసభ సభ్యత్వాలు కానీ దక్కాలి. బిజెపి ఈ విసయంలో పారదర్శకంగా పనిచేస్తే మంచిది

# విషాదంలోనూ రాజకీయాలేనా ..?



లక్నో:సనాతనధర్మం...కుంభమేళ పర్వంలో స్పష్టంగా గోచరిస్తోంది. ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కుంభమేళా కోసం యూపి ప్రభుత్వం గత రెండేళ్లుగా పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. దీంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా సిఎం యోగి ఆదిత్యనాథ్ జాగ్రత్తలు తీసుకున్నారు. కోట్లాది మంది వచ్చి పుణ్యస్నానాలు ఆచరించే స్థలం కాబట్టి పలు జాగ్రత్తలు అవసర మయ్యాయి. కానీమౌని అమవాస్యవేళ పుణ్యస్నానమాచరించడం అద్భుతం..అంటూ భక్తకోటి ప్రయాగ్ రాజ్‌కు క్యూకట్టింది. ఇప్పటికే అక్కడ ఇసుకేస్తే రాలనంత జనం. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్. బుధవారం మౌని అమవాస్య సందర్భంగా 10కోట్లమంది భక్తులు వస్తారని అంచనా వేసి మరీ ఏర్పాట్లు చేశారు. కానీ ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా..ప్రజలు మాత్రం క్రమశిక్షణ అలవర్చుకోలేక పోతున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారు జామున పరిస్థితి తొక్కిసలాటకు దారితీసింది. జరగరాని అపచారం జరిగింది. ప్రశాంతంగా సాగుతున్న కుంభమేళా మహావిషాదం నింపింది. కనీసం 30 మంది మరణించారని, మరో 50 మంది క్షతగాత్రులు అయ్యారని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఘటన విషాదకరం. వారి కుటుంబాల కు తీరని లోటు. అలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ సహా సమాజ్‌వాదీ పార్టీ రాజకీయాలు చేయడం దారుణం. కుంభమేళాలో విఐపి సంస్కృతి వల్లనే ప్రమాదం జరిగిందని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యమంటూ గగ్గోలు పెట్టారు. కుంభమేళాలోమునిగినా మోడీ, అమిత్ షాలు నరకానికి పోతారని ఖర్గే శాపనార్థాలు పెట్టారు. యోగి రాజీనామా చేయాలని యూపి మాజీ సిఎం అఖిలేశ్ యాదవ్ అన్నారు. ఏర్పాట్లు సక్రమంగా లేవని నిందించారు. ఇలా ఎంతగా రాజకీయం చేయాలో అంతా చేశారు. నిజంగానే ఇక్కడ కించిత్ కూడా లోపం లేదు. ఏర్పాట్లలో పొరపాట్లు లేవు. ప్రజల తొందరపాటు కారణంగా, గందరగోళం కారణంగా దుర్ఘటన జరిగింది. ఆ తరవాత అంతా సద్దు మణిగింది. దాదాపు మూడున్నర కోట్ల మంది ఒక్కరోజే పుణ్యస్నానాలు చేసినట్లుగా చెబుతున్నారు. ఇంత పెద్ద మహాజాతరలో జరిగిన ఘటనను కూడా రాజకీయం చేయడం కాంగ్రెస్‌కే చెల్లింది. యూపి సిఎం రాజీనామా చేయాలనడం అజ్ఞానం తప్ప మరోటి కాదు. జాతరలు, కుంభమేళాలు, సముద్ర స్నానాల సమయంలో సంయమనంతో సాగాల్సి ఉన్నా అలా జరగలేదు. కోట్లాది మంది వస్తారని తెలిసీ..ప్రజలు ఉరుకులు పరుగులు తీయడంతో జరగరాని దుర్ఘటన జరిగింది. ప్రయాగరాజ్ మౌని అమవాస్య వేళ జనమహాసంద్రంగా మారింది. నిజానికి మంగళవారం మధ్యాహ్నానాని కే 2.39కోట్లమంది ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నట్లు సమాచరం వచ్చింది.. మామూలుగా రోజుకు కోటిమంది వస్తేనే త్రివేణి సంగమ ప్రాంతం కిటకిటలాడుతూ ఉంటుంది. అలాంటిది ఒక్కరోజే 2కోట్ల 39లక్షలమంది రావడంతో..ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే అన్నిదారులు కిటకిటలాడాయి. ఇంత భారీగా భక్తులు క్యూకట్టడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. ఇక భక్తులు రైల్వేస్టేషన్, బస్టాండ్,.. ఇలా పలుమార్గాల్లోనుంచి త్రివేణి సంగమం చేరుకోవాలంటే 10నుంచి 12కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే ఎంతగా జనం వచ్చారో అర్థం చేసుకోవచ్చు. జనవరి 13న ప్రారంభమైన ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్..మొదటి రోజునుంచే బారీ భక్తజనం పోటెత్తింది. తొలిరోజే పౌష్ పూర్ణిమ కావడంతో మొత్తం 1 కోటి 65 లక్షల మంది స్నానాలు చేసినట్లు లెక్కలు వచ్చాయి. అలా ఇప్పటివరకు దాదాపు 17కోట్లమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు లెక్కలు చెబుతున్నాయి. డిజిటల్ కెమెరాల ద్వారా కౌంటింగ్ కొంచెం తేలికైంది. యూపీ ప్రభుత్వం ఈ ఏడాది నగరవ్యాప్తంగా 2700 కెమెరాలను ఏర్పాటు చేసింది. వీటిలో 1800 కెమెరాలను జాతర ప్రాంతంలో ఏర్పాటు చేశారు. 1100 పర్మినెంట్ కెమెరాలు కాగా, మిగిలిన700 తాత్కాలిక కెమెరాలు. 270 కంటే ఎక్కువ కెమెరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఇన్‌స్టాల్ చేశారు. లెక్కింపు పక్రియ ఎలా ఉంటుందంటే..ఓవ్యక్తి కెమెరా సర్కిల్‌లోకి రాగానే ఆటోమేటిక్‌గా కౌంట్ చేయబడతాడు. ఏఐ కెమెరాలు ప్రతి నిమిషానికి డేటా అప్‌డేట్ చేస్తూ ఉంటాయి. మొత్తం మూడు విధాలుగా ఈలెక్కింపు పక్రియ ఉంటుంది. ప్రయాగ్‌రాజ్ చేరుకునేందుకు 7ప్రధాన మార్గాలు ఉన్నాయి. అక్కడి నుంచి త్రివేణి సంగమానికి చేరుకునేందుకు మొత్తం 12 మార్గాలను ఏర్పాటు చేశారు. ఈసారి క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ఃూక్షఖ యాప్‌ను యూపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. డ్యూటీ చార్ట్‌లు, రూట్ ప్లానింగ్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పాంటూన్ బ్రిడ్జ ఏర్పాట్లతో పాటు క్రౌడ్ కంట్రోల్ ప్లాన్‌లు వంటివన్నీ ఉన్నాయి. బుధవారం మౌని అమవాస్య కావడంతో దాదాపు 8 నుంచి 10కోట్ల మంది భక్తజనం వస్తారని అంచనా. అందుకు తగ్గట్టుగానే భారీ బందోబస్తు, వసతి సౌతర్యాలను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నిరంతరంగా అందుబాటులో ఉండేలా భద్రతా బలగాలను మోహరించి..ఎలాంటి అవాంఛనీయా సంఘటనలు జరగకుండా పూర్తి భద్రత ఏర్పాట్లును పకడ్బందీగా చేసింది. మౌని అమవాస్యలో స్నానమాచరిస్తే పాపాలన్నీ హరిస్తాయని భక్తుల నమ్మకం. అందుకే అఘోరాలు, సామాన్యులు, నాగ సాధువులు, ఇతర సాధువులు ప్రయాగ్‌రాజ్ వెళ్లి స్నానమాచ రిస్తారు. ఈ శుభ ముహూర్తంలో పుణ్యస్నానం ఆచరించాలని చాలా మంది ఆసక్తిగా ప్రయాగ్ రాజ్ చేరుకున్నారు. ఈ పవిత్రమైన రోజున గంగా స్నానం చేస్తే ఎంతో పుణ్యం దక్కుతుందని భక్తుల నమ్మకం. మౌని అమావాస్య రోజు మౌన వ్రతం పాటించే సంప్రదాయం ఉంది. సాధకులు ఈ రోజున మౌనంగా ఉపవాసం పాటిస్తారు. ఇది ప్రధానంగా స్వీయ నియంత్రణతో పాటు మానసిక ప్రశాంతత కోసం చేస్తారు. ఈ ఉపవాసాన్ని రుషులు, సాధువులు కూడా ఆచరిస్తారు. ఎందుకంటే మౌనంగా ఉండటం వల్ల మనస్సును నియంత్రించడంతో పాటు ధ్యానంలో ఏకాగ్రత వస్తుంది. మౌని అమావాస్య ఉపవాసం కేవలం మతపరమైన ఆచారం మాత్రమే కాదు, స్వీయ నియంత్రణ, ధ్యానం ద్వారా మానసిక, ఆధ్యాత్మిక శాంతిని పొందే అవకాశాన్ని కూడా అందిస్తుంది. అంతటి ప్రాముఖ్యం ఉంది కాబట్టే భక్తులు మౌని అమవాస్యలో త్రివేణిసంగమంలో స్నానమాచరించేందుకు ప్రయాగ్‌రాజ్‌కు కోట్లాదిగా తరలివచ్చారు. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాట మహా విషాదాన్ని నింపింది.

# బడ్జెట్ అంటే.....ప్రజల నడ్డి విరచడమేనా ?



న్యూఢిల్లీ,బడ్జెట్ అంటే పన్నులతో పీక్కు తినడం అన్న భావన రూఢీ అయ్యింది. ఎక్కడి నుంచి ఏ రూపంలో ఎంత వసూలు చేయవచ్చో అన్న లెక్కలు కట్టి..దానికి కొంత జోడించి...కొన్ని పనులను కొంత కేటాయింపులు చేసి చూపడమే బడ్జెట్. ఈ లెక్కల ప్రకారం వచ్చే ఆదాయానికి, చెల్లించే ఖర్చులకు లెక్కల పొంతన కుదరాలి. నిజానికి ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన మొత్తాన్ని దేశాన్ని నడపడానికి ఉపయోగించాలి. జీతాలు, ఆస్పత్రులు, విద్యా, రైలు, రోడ్డు తదితర అభివృద్ధి పనులకు వినియోగించాలి. అంతేగానీ ఉచితపథకాలతో దుబారా చేయరాదు. పన్నులు కూడా హేతుబద్దంగా ఉండాలి. ప్రజల నడ్డి విరిచేలా పన్నులు ఉంటే...వారు పన్నులు కట్టలేని దుస్థితి ఏర్పడుతుంది. ఇకపోతే ప్రజలు సంపాదించు కున్న డబ్బుల్లో నేరుగా 30 శాతం ప్రభుత్వం లాగేసుకుంటుంది. ఉద్యోగుల నుంచి కూడా టిడిఎస్ ద్వారా నేరుగా లాగేసుకుంటుంది. అంటే మనం ఎంత సంపాదించినా ముందుగా 30శాతం బొక్క పెట్టుకోవాల్సిందే. అలాగే మనం పెట్టుకునే ఖర్చులకు లెక్కలు చెప్పుకోవాలి. ఇలా ఏటా మన సంపాదన నుంచి కాబూలీవాల వడ్డీలాగా చెల్లించుకోవాల్సిందే. తేడా వస్తే ప్రభుత్వం వారు దాడి చేసి, కేసులు పెట్టి వేధించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇలా మన ఆర్థిక చట్టం నిర్దేశించుకున్నాం. అందుకే ఇన్‌కమ్ ట్యాక్స్ అనగానే ఉద్యోగులు, వ్యాపారులు భయపడుతుంటారు. నిజానికి ఇలాంటి భయాలు లేని ఆదాయపు చట్టం రావాలి. పెరుగుతున్న ధరల నేపథ్యంలో వాటిని ఎలాగే కంట్రోల్ చేయడం లేదు. కనీసం పన్నుల భారం అయినా తగ్గుతుందా అంటే అదీ ఉండడం లేదు. కట్టిన డబ్బులతో అధికారంలో ఉన్న నేతలు వారి జల్సాలకు ఎక్కువగా వినయోగిస్తున్నారు. మంత్రులు, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, రాష్ట్రపతి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలకు కూడా మనం చెల్లించే పన్నుల నుంచే జీతభత్యాలు చెల్లించాలి. ఉద్యోగులకు కూడా జీతాలు, పెన్షన్లు కూడా ఇందులో నుంచే ఇవ్వాలి. ఇవి గాకుండా దేశంలో ఏ పని చేపట్టాలన్నా ఇందులో నుంచే ఖర్చు చేయాలి. ఇవన్నీ సమతూకం పాటించేలా, లెక్కలు బేరీజు వేసుకుని బడ్జెట్ రూపొందిస్తారు. ఈ క్రమంలో దేశ ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్న బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం రాష్ట్రపతి ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి.ఫిబ్రవరి 1న అంటే శనివారం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వరసగా 8వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఏటాలాగానే పేద, మధ్యతరగతి ప్రజలు తమకు చేకూరే లబ్ది గురించి ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే చాలా మందికి బడ్జెట్ లెక్కలు పెద్దగా అర్థం కావు. బడ్జెట్‌లో దేనికి పెంచారు..దేనికి తగ్గించారు అని చూస్తుంటారు. సిగరెట్లు, మద్యం వంటి వాటికి ఏటా పన్నుపోటు తప్పదు. ఎలక్ట్రానిక్స్ తదితర దిగుమతి వస్తువలపైనా సుంకాలు పెంచుతూనే ఉంటారు. ఇలా పత్రికల్లో వచ్చిన, లేదా టీవీల్లో వచ్చిన వార్తల ఆధారంగా ప్రజలు బడ్జెట్ గురించి బేరీజు వేసుకుంటారు. తమ జేబులకు ఎంత చిల్లు పడబోతున్నదో లేక్కలేసుకుంటారు. స్థూలంగా చెప్పాలంటే బడ్జెట్ ఇదే. కొన్ని ప్రధాన అంశాలపై దృష్టి పెట్టగలిగితే బ్జడెట్ గురించి తెలుసుకునే అవకాశం లభిస్తుంది. వాటిలోని గణాంకాలను అర్థం చేసుకోగలిగితే ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లేందు కు దేనిపై దృష్టి పెట్టాలో అర్థమవుతుంది. రుణాలు కాకుండా ప్రభుత్వ మొత్తం ఖర్చులు దాని ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఆర్థికలోటు ఏర్పడుతుంది. అప్పులు తెచ్చి వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకూ ఉంటుంది. ఇందులో రాబడి ఎంత..ఖర్చులు ఎంత అన్నది లెక్కలు వేస్తారు.బడ్జెట్లో ఆర్థికలోటును జీడీపీలో 4.9 శాతంగా కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక లోటుపై కేంద్రం ఏం చెప్తుందోనని మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. అంవటే ఈ లోటు ఎలా పూర్తి చేస్తారన్నదే ఇక్కడ ప్రశ్న. అందుకు పన్నులు వేయడం వంటివి ప్రధానంగా ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం తన ఆర్థిక లోటును తీర్చుకునేందుకు పలు రకాలుగా రుణాలు సేకరిస్తుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం స్థూల రుణ బడ్జెట్ రూ. 14.01 లక్షల కోట్లుగా ఉంది. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన స్థూల రుణ బ్జడెట్ గురించి మార్కెట్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కేంద్రం పన్నుల ద్వారా ప్రభుత్వ నిర్వహణకు అవసరమయ్యే ఆదాయం సమకూర్చుకుంటుంది. 2024-25 బ్జడెట్‌లో స్థూల పన్ను ఆదాయాన్ని రూ.38.40 లక్షల కోట్లుగా కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. దీంట్లో ప్రత్యక్ష పన్నుల ద్వారా రూ.22.07 లక్షల కోట్లు, పరోక్ష పన్నుల ద్వారా రూ.16.33 లక్షల కోట్లు వస్తాయని అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయం రూ.11.1 లక్షల కోట్లుగా కేంద్రం అంచనా వేసింది. అయితే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా 2024 మొదట్లో ఖర్చులు బాగా నెమ్మదించాయి. దీనికి ఎన్నికల కోడ్ కారణమనే చెప్పొచ్చు. కాగా, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్లో మూలధన వ్యయం ప్రకటనపై ఉత్కంఠ నెలకొంది. ఈ ఏడాది కేంద్రం వివిధ పథకాలు, అభివృద్ధి పనుల కింద ఎంత ఖర్చు చేయనుందో బడ్జెట్ సమావేశాల్లో తెలియనుంది. 2024లో సాధారణ ప్రభుత్వ రుణం-జీడీపీ నిష్పత్తి 85 శాతం ఉండగా.. అందులో ఒక్క కేంద్ర ప్రభుత్వ రుణమే 57 శాతంగా ఉంది. నిర్మలా సీతారామన్ 2024-25 బడ్జెట్ ప్రసంగంలో 2026-27 నుంచి జీడీపీలో ద్రవ్యలోటు తగ్గించేందుకు నిరంతరం ప్రయత్ని స్తామని చెప్పిన విషయం తెలిసిందే. స్తు, సేవల పన్ను అంటే జీఎస్టీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.10.62 లక్షల కోట్లకు చేరుకుంటుందని అధికార వర్గాలు అంచనా వేశాయి. కావున 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీఎస్టీ రాబడి భారీగానే ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారతదేశ జీడీపీ వృద్ధి రేటును ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 10.5 శాతంగా కేంద్రం అంచనా వేసింది. కాకపోతే వాస్తవ జీడీపీ వృద్ధి 6.4 శాతంగా ఉంటుందని ఆర్థిక పండితులు చెబుతున్నారు. అయితే జిఎస్టీ పన్నులు తలకు మించిన భారంగా ఉన్నాయి. హెల్త్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ లాంటి వాటిపైనా 18శాతం జిఎస్టీ విధించడం వల్ల సామాన్యులు గగ్గోలు పెట్టినా కేంద్రం పట్టించుకోలేదు. మొత్తంగా పన్నుల హేతుబ్దీకరణతో పాటు, ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నం చేసినప్పుడే ప్రజలకు ఊరట కలుగుతుంది. అలాగే ధరల స్థిరీకరణకు చర్యలు కూడా అవసరం. ఈ రకమైన చర్యలు లేకుండా ఏ ప్రభుత్వం ఉన్నా ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు.

# ప్రధానులుగా ఉంటూ బడ్జెట్ సమర్పణ

న్యూఢిల్లీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో పార్లమెంట్ ఉభయసభలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. కేంద్ర బడ్జెట్ 2025ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్ట నున్నారు. దీంతో మోదీ 3.0 పాలనలో మిగిలిన కాలంలో ముఖ్యమైన ఆర్థిక ప్రకటనలు, ప్రభుత్వ నిర్ణయాలు, పథకాలపై ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఈ బడ్జెట్ కీలకంగా మారనుంది. భారతదేశ బడ్జెట్ చరిత్రను చూస్తే అనేక ముఖ్యమైన అంశాలు ఉన్నాయని చెప్పవచ్చు. వాటిలో ముఖ్యంగా ఆర్థిక మంత్రులు మాత్రమే కాకుండా, ప్రధానమంత్రులు కూడా బ్జడెట్ ప్రవేశపెట్టిన సందర్భాలు ఉన్నాయి. భారతదేశ తొలి ప్రధానమంత్రి అయిన జవహర్‌లాల్ నెహ్రూ 1958లో కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టిన తొలి ప్రధానమంత్రిగా నిలిచారు. ఈ సంవత్సరంలో ముంద్రా కుంభకోణం నేపథ్యంలో అప్పటి ఆర్థిక మంత్రి టీటీ కృష్ణమాచారి రాజీనామా చేయవలసి వచ్చింది. ఆ క్రమంలో నెహ్రూ స్వయంగా ఆర్థిక మంత్రిత్వ శాఖ బాధ్యతలు స్వీకరించి, 1958లో కేంద్ర బ్జడెట్‌ను సమర్పించారు. మొరార్జీ దేశాయ్ 1977 నుంచి 1979 వరకు భారతదేశంలో జనతా పార్టీతో ప్రధానమంత్రిగా సేవలందించారు. ఆయన కేవలం ప్రధానమంత్రిగా మాత్రమే కాకుండా, ఆర్థిక మంత్రిగా కూడా పనిచేశారు. ఆయన భారతదేశంలో అత్యధిక సంఖ్యలో కేంద్ర బడ్జెట్ లను ప్రవేశపెట్టిన రికార్డ్ కలిగి ఉన్నారు. మొత్తం 10 బడ్జెట్లతో ఆయన రికార్డు సృష్టించారు. ఇందులో 8 వార్షిక బడ్జెట్, 2 తాత్కాలిక బడ్జెట్లు ఉన్నాయి. 1959 నుంచి 1963 వరకు ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఆయన, 1962లో తాత్కాలిక బడ్జెట్ ను సమర్పించారు. భారతదేశ తొలి మహిళా ప్రధాన మంత్రి అయిన ఇందిరా గాంధీ 1969లో ప్రధానమంత్రి అయ్యారు. ఆ సంవత్సరం, మొరార్జీ దేశాయ్ రాజీనామా చేసిన తర్వాత, ఆయన ఆర్థిక మంత్రిత్వ శాఖ బాధ్యతలను స్వీకరించి ఆమె 1970లో బడ్జెట్ ను సమర్పించారు.భారతదేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 1987లో, అప్పటి ఆర్థికమంత్రి వి. పి. సింగ్‌ను పదవి నుంచి తొలగించిన తర్వాత కొంతకాలం ఆర్థిక శాఖ బాధ్యతలను చేపట్టారు. ఆ సమయంలో, ఆయన కొన్ని కీలక ఆర్థిక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక నిపుణుడు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ 1991 నుంచి 1996 వరకు పి.వి. నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఆయన సమర్పించిన 1991 బడ్జెట్ భారతదేశ ఆర్థిక చరిత్రలో ఒక మలుపు మలుపు అని చెప్పవచ్చు. ఇది భారత ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి, సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వంటి నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టింది. 1994లో ఆయన సమర్పించిన బ్జడెట్‌లో సేవా పన్ను ప్రవేశపెట్టడం ద్వారా ప్రస్తుతం ఇది ప్రభుత్వం ప్రధాన ఆదాయ వనరుగా నిలిచింది. ఇలా ప్రధానమంత్రులు, కేవలం దేశ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మాణం చేయడం మాత్రమే కాకుండా, ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలతో దేశం ప్రగతిని ప్రేరేపించారు.

# తొక్కిసలాట ఘటనతో ప్రభుత్వం అప్రమత్తం

ప్రయాగరాజ్, ప్రపంచంలో అతిపెద్ద మత సంస్కృతి పండుగ అయిన మహా కుంభమేళా 2025 ఉత్సవం ఈసారి కీలక మార్పులతో జరుగుతోంది. ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న ఈ మహా కుంభమేళాలో భక్తుల రద్దీ, రవాణా వ్యవస్థ పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో యూపి ప్రభుత్వం మరింత పక్కాగా ఏర్పాట్లు చేసింది. అందుకు అనుగుణంగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఇవి ఉత్సవం సక్రమంగా నిర్వహించేందుకు తోడ్పడనున్నాయి. ఈ మార్పులు భక్తులు సురక్షితంగా ఆయా ప్రాంతాలను చేరుకోవడానికి సహాయపడతాయి. ఈ మహా కుంభమేళాలో మున్ముందు మళ్లీ విషాదాలు జరక్కుండా ఇంలాంటి కీలక మార్పులు తీసుకున్నారు. ఈ సారి భక్తుల రద్దీని నియంత్రించడానికి, ముఖ్యంగా ప్రధాన ఘాట్ల దగ్గర ప్రభుత్వం వివిధ చర్యలు తీసుకుంటోంది. ప్రతి గంటకు ఒక సెట్ కొంతమంది భక్తులను మాత్రమే అనుమతించడం ద్వారా రద్దీని కంట్రోల్ చేయాలని నిర్ణయించుకున్నారు. ముఖ్యమైన ఘాట్ల వద్ద రద్దీని తగ్గించడం, భక్తులకు బాగా ప్రాధాన్యత ఇవ్వడం, వృద్ధులు, వికలాంగులు, మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు ఈ చర్యలు తీసుకోబడినట్లు ప్రభుత్వం తెలిపింది. మహా కుంభమేళా ప్రాంతంలో పర్యటించే భక్తుల రవాణాను బాగా కంట్రోల్ చేయడం కోసం ఫిబ్రవరి 4 వరకు 'నో వెహికల్ జోన్' అమలు చేయాలని నిర్ణయించారు. అంటే భక్తులు ప్రదేశంలో అడుగు పెట్టే ముందు తమ వాహనాలను ఆయా ప్రాంతాలలో మాత్రమే పార్క్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వీలైనంత వరకు అందరికీ పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. దీని ద్వారా ట్రాఫిక్ జామ్, రద్దీని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది.ఈసారి మహా కుంభమేళాలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలకు అనుమతి ఇవ్వకూడదని నిర్ణయించారు. ప్రత్యేకంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు ఆ ప్రాంతంలో ప్రవేశించకుండా ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో భక్తులు ఆన్‌లైన్‌లో ముందుగా తమ వాహనాన్ని నమోదు చేసుకుని మాత్రమే పర్యటనకు రావాల్సి ఉంటుంది. ఈ చర్యకు అనుగుణంగా, వాహనాల సంఖ్యను కూడా నియంత్రించేందుకు ఇది సహాయపడుతుంది. భక్తుల రవాణా సరళతను పెంచేందుకు, ప్రయాగ్ రాజ్ నగరంలో వన్ వే రూట్ వ్యవస్థ అమలు చేయాలని నిర్ణయించారు. ముఖ్యమైన ప్రాంతాలకు, ఘాట్ల దగ్గరకు వెళ్లే దారులను ఒకవైపుగా మార్చి, మరో వైపు నుంచి రాకపోకలను పూర్తిగా వేరే రూట్లతో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ విధంగా భక్తుల రవాణా మరింత సురక్షితంగా, సమర్థవంతంగా ఉండాలని ప్రభుత్వం ఆశిస్తోంది. మహా కుంభమేళాలో ఇతర సంవత్సరాల్లో వీఐపీ పాస్‌లు ఇచ్చి, ముఖ్య అతిథులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుండగా, ఈసారి యూపీ ప్రభుత్వం ఒక సంచలనం నిర్ణయం తీసుకుంది. 'వీఐపీ పాస్‌లు' ఇకపై ఇవ్వడం లేదని ప్రకటించారు. ఈ విధానం ద్వారా వీఐపీలు, సర్వసాధారణ భక్తులకు సమానమైన అవకాశం కల్పించబడుతుంది. ఈ నిర్ణయం వల్ల ప్రజల మధ్య అసమానతలు తగ్గిపోతాయని ప్రభుత్వం భావిస్తుంది. అంతేకాక ఇందులో వీఐపీ పాస్‌ల ద్వారా ఏర్పడే అనవసరమైన రద్దీని కూడా తొలగించాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రతీ సంవత్సరం కోట్లాది మంది భక్తులు కుంభమేళాలో పాల్గొంటూ తమ ఆధ్యాత్మిక మొక్కులను తీర్చుకుంటారు.

### జిహెచ్ఎంసిలో కాంగ్రెస జెండా ఎగురేస్తాం

హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కులగణన నివేదికపై ఫిబ్రవరి 5న కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. రిజర్వేషన్ల పెంపు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల సంక్షేమ పథకాలు అమలు కావడం లేదనే అంశంపై స్పందించిన ఆయన.. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారుల వైఫల్యం కారణంగానే కొంతమేరకు పథకాలు లబ్దిదారులకు అందడం లేదన్నారు.

# విద్యార్థి వీసాలపై ట్రంప్ దృష్టి

వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏ రోజు ఎవరిని టార్గెట్ చేస్తాడో తెలియడం లేదు. ఒక్కో నిర్ణయంతో బాధితులు వణుకుతున్నారు. తాజాగా విద్యార్థి వీసాల గడువు ముగిసినా అమెరికాలోనే అక్రమంగా ఉంటున్నవారిపై ఇప్పుడా దేశం దృష్టిపెట్టింది. తాజాగా అమెరికాలో వలస చట్టాల అమలును పునరుద్ధరించడంపై హౌస్ కమిటీ విచారణ చేపట్టింది. ఈసందర్భంగా చట్టసభ సభ్యులు పలు సూచనలు చేశారు. 2023లో వీసా గడువు ముగిసినా.. 7,000 మంది భారతీయ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు చాలాకాలం అమెరికాలోనే ఉండిపోయారని సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్‌కు చెందిన జెస్సికా ఎం.వాఘన్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. కనీసం 32 దేశాలకు చెందిన విద్యార్థులు, స్టూడెంట్ ఎక్స్ఛేంజి విజిటర్లలో 20శాతానికి పైగా వీసా గడువు దాటినా అమెరికాలోనే ఉంటున్నారని పేర్కొన్నారు. ఎఫ్, ఎం కేటగిరీల్లో వీసాలు పొందినవారే అత్యధికంగా ఈ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. అమెరికా స్కూల్స్, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పూర్తిస్థాయి విద్యార్థిలా చదువుకొనేందుకు ఎఫ్-1 వీసాలు జారీ చేస్తారు. దీంతోపాటు సెమినార్లు, భాషపై శిక్షణలకు కూడా వాడతారు. ఇక ఎం-1 వీసాలను వృత్తివిద్యా కోర్సులు, నాన్ అకడమిక్ అవసరాలకు, లాంగ్వేజ్ ట్రైనింగ్‌లకు వాడుతుంటారు. 'బ్రెజిల్, చైనా, కొలంబియా, ఇండియాల్లో ఒక్కో దానికి చెందిన 2,000 మందికి పైగా విద్యార్థులు వీసా గడువు ముగిసినా ఇంకా అమెరికాలోనే ఉన్నారు. వీరిలో అత్యధికంగా భారతీయుల సంఖ్య 7,000. వీసా పాలసీల్లో మార్పులు అవసరం. మారుమూల ప్రాంతాల్లో కూడా అక్రమ వలసదారులను గుర్తించి వెనక్కి పంపేలా ఇంటీరియర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానాన్ని బలోపేతం చేయాలి. చట్టంలో కాంగ్రెస్ పలు సవరణలు చేయాలి. ద్వంద్వ ఉద్దేశాలను విద్యార్థి వీసాలకు వర్తింపజేయకూడదు. దీంతోపాటు ప్రతి స్టూడెంట్ చదువు పూర్తయిన తర్వాత స్వదేశానికి వెళ్లటానికి సిద్ధంగా ఉండాలి' అని జెస్సికా ఎం.వాఘన్ పేర్కొన్నారు. ఇక హెచ్-1బీ వీసాలకు రెండేళ్ల గడువు మాత్రమే ఉండాలని జెస్సికా పేర్కొన్నారు. వీటిని అవసరాన్ని బట్టి నాలుగేళ్లకు పొడిగించుకొనేలా అవకాశం ఇవ్వాలన్నారు. గ్రీన్‌కార్డు పిటిషన్ల ఆధారంగా ఆటోమేటిక్‌గా పొడిగింపులు లభించకూడదని కమిటీకి సూచించారు. ' రీసెర్చి, నాన్ ప్రాఫిట్ సహ వీసాల సంఖ్య 75,000లోపే ఉండాలి. ప్రస్తుతం అపరిమితంగా ఉంది. ఒకవేళ వీసా సబ్‌స్క్రిప్షన్లు ఎక్కువగా ఉంటే.. అత్యధికంగా వేతనాలు చెల్లించే సంస్థకు కేటాయించారు. ఇలా చేయడం వల్ల ఎక్కువ ప్రతిభ ఉన్నవారికి అవకాశం లభిస్తుంది. ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగులుగా చాలా పరిమిత సంఖ్యలో.. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే వీసాలు కేటాయించాలని ఆమె సూచించారు. అమెరికాలో ఉద్యోగులకు కొదవ లేదని జెస్సికా పేర్కొన్నారు. ఒక్క స్టెమ్ డిగ్రీలు పూర్తి చేసి.. ఆయా రంగల్లో పనిచేయకుండా.. లేదా ఉద్యోగాలకు దూరంగా ఉన్నవారి సంఖ్యే 20 లక్షలు ఉందని గుర్తుచేశారు. ఇప్పుడు వీరందరి చిట్టా రాబడుతున్నారు.

## బిఆర్ఎస్ హయాంలో పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

హైదరాబాద్, బిఆర్ఎస్ హయాంలో పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో కెసిఆర్ ముందుకు సాగారని పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఆనాడు ప్రత్యేకంగా నిధులు విడుదల చేశామని అన్నారు. అందుకే ఆర్థిక ఇంజిన్లుగా ఉన్న పట్టణాలను, వాటిని సమగ్రంగా డెవలప్ చేయాలని అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. సమైక్య రాష్ట్రంలో మున్సిపాలిటీలు మురికి కూపాలుగా ఉండేవని.. బల్దియాలు అంటే ఖాయా.. పియా.. చల్దియా.. అనే సామెత ఉండేది కెటి రామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కేసీఆర్ పట్టణాల అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌తో పని చేయాలని దిశా నిర్దేశం చేశారన్నారు. పట్టణీకరణ ఆపాలని కొన్ని దేశాలు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయన్నారు. పట్టణాల విస్తరణ ఆపడం వీలు కాదు.. కానీ ప్రభుత్వాలకు వాటిని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి మాత్రం అవకాశం ఉంటుందన్నారు. అందుకే ఆ దిశగా పదేళ్లు పనిచేశామన్నారు. చేసిన పనిని అభివృద్ధి నివేదికల రూపంలో ప్రజల ముందుంచామన్నారు. దేళ్ల పాటు జరిగిన పట్టణాలు అభివృద్ధి కేవలం డైలాగులు కొడితే కాలేదన్నారు. పక్కా ప్రణాళికతో పాటు అవసరమైన సంస్కరణలు, నిరంతర పర్యవేక్షణ అవసరమైన నిధులు అందించడం తదితర నిరంతర ఫోకస్‌తోనే తెలంగాణలోని పట్టణాలు ఈ రోజు మోడల్ పట్టణాలుగా తయారయ్యాయన్నారు. తెలంగాణ పట్టణాలకు పదేళ్లలో అనేక జాతీయ అవార్డులు దక్కాయన్నారు. గత పది సంవత్సరాలుగా మున్సిపల్ చైర్‌పర్సన్లు కౌన్సిలర్లుగా పట్టణాల అభివృద్ధి కోసం పని చేశారన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి పూర్తి చేశారని చెప్పారు. పదవీ కాలం ముగిసిన చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలని.. మళ్లీ ఎన్నికలు వస్తే ప్రజలు గెలిపించుకుంటారన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున పరిపాలన వికేంద్రీకరణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు పరిపాలన మరింత దగ్గరైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పట్టణాలతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా పెరిగిందన్న కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పట్టణాలు అభివృద్ధి కుంటుపడడంతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా భారీగా పడిపోయిందని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన కొత్తగా కట్టాల్సింది పోయి హైడ్రా, మూసి ప్రాజెక్టుల పేరుతో కూలగొడు తున్నారన్నారు. ప్రభుత్వాన్ని నడిపే వారి ఆలోచనలు సానుకూలంగా ఉంటే రాష్ట్రం, పట్టణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గతంలో నల్లగొండ పట్టణాన్ని సమూలంగా అభివృద్ధి చేసిన మనల్ని కాంగ్రెస్ మంత్రులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని.. కానీ అదే నల్లగొండ పట్టణంలో నాలుగు నెలలుగా సిబ్బందికి జీతాలు లేకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నల్లగొండ పర్యటన తర్వాత నన్ను బచ్చగాడు అంటున్న మంత్రి.. సీనియర్ అయ్యుండి పట్టణ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. మోసపూరిత 420 హమీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పాలన చేతకావడం లేదన్నారు. టకీ టకీ మని పైసలు పడుతా యన్నారని.. కానీ, టకీ టకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నాయన్నారు. ఆరున్నర లక్షల కొత్త రేషన్ కార్డులను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇవ్వనేలేదంటూ అబద్దాలు చెబుతుందన్నారు. ఈ విషయం అప్పటి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ నాయకులను అడిగితే తెలుస్తుందన్నారు.

## పగలు పూజలు..రాత్రిళ్లు దోపిడీలు

అమరావతి,రాష్ట్రంలో అత్యంత అవినీతిపరుడు జగన్ అయితే.. ఆయన్ను మించిన వ్యక్తి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని ఏపీ శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ విమర్శించారు పుంగనూరు ఓటర్ల లిస్టు కన్నా పెద్దిరెడ్డి అవినీతి, పాపాల లిస్టే ఎక్కువగా ఉందని వ్యాఖ్యానించారు.ఆయన పగలు పూజలు.. రాత్రంతా దోపిడీలు చేస్తుంటారని ఆరోపించారు. పెద్దిరెడ్డి అవినీతి సామ్రాజ్యం మండల స్థాయి నుంచి కేంద్రం వరకు పాకిందన్నారు.

# ఫోర్త్ సిటీలో రూ.3500 కోట్లతో.. ఏఐ డేటా సెంటర్..



హైదరాబాద్,సింగపూర్ దావోస్ పర్యటనలతో సీఎం రేవంత్ రెడ్డి షెడ్యూల్ బిజిబిజీగా గడిచింది. తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం కొనసాగింది. మరోవైపు గ్రామసభలు, 4 కొత్త పథకాలకు లబ్దిదారుల ఎంపికతో ఈ వారం ప్రజా ప్రభుత్వం స్పీడ్ పెంచింది.

19-01-2025 ఆదివారం ( సింగపూర్ లో సక్సెస్ )

సింగపూర్ లో మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రతినిధి బృందం వివిధ రంగాల్లో పేరొందిన ప్రపంచ స్థాయి సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక చర్చల్లో పాల్గొంది. ఆ క్రమంలో ఈనెల 19న భారీ పెట్టుబడులు సాధించింది. సింగపూర్ ప్రధాన వ్యాపార సంస్థల అధినేతలు, సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఇండియన్ ఓషన్ గ్రూప్ ఫౌండర్, డీబీఎస్ కంట్రీ హెడ్, బ్లాక్ స్టోన్ సింగపూర్ సీనియర్ ఎండీ సహా పలువురు పారిశ్రామిక వేత్తలతో భేటీ అయ్యారు.తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వ విధానాలను వారికి వివరించారు. ఫ్యూచర్ సిటీలో ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటుకు ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చింది. 3,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ లో 450 కోట్లతో భారీ ఐటీ పార్కు ఏర్పాటుకు క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలు, పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్ తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి.

20-01-2025 సోమవారం ( కబ్జాలపై ఉక్కుపాదం )

కబ్జాలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా వెనక్కి తగ్గడం లేదు. పర్యావరణంపై ప్రేమ ఉన్న వారు ఫిర్యాదులు చేసేందుకు ముందుకొస్తూనే ఉన్నారు. ఈనెల 20న బుద్ధభవన్‌లోని హైడ్రా ఆఫీస్ లో నిర్వహించిన ప్రజావాణికి భారీగా ఫిర్యాదులు వచ్చాయి. చెరువులు, పార్కులు, రోడ్ల ఆక్రమణలపై 89 ఫిర్యాదులు అందాయి. కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా కంప్లైంట్స్ స్వీకరించారు.ప్రాంతాల వారీగా ఉన్న అధికారులకు క్షేత్రస్థాయిలో పరిశీలించి రిపోర్ట్ ఇవ్వాలన్నారు.

ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులపై గూగుల్ మ్యాప్, సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఫోటోలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఫిర్యాదుదారులకు చూపించి క్షేత్రస్థాయి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా అమీన్‌పూర్ పరిసర ప్రాంతాల నుంచి అధిక ఫిర్యాదులు వస్తుండడంతో ఆ మున్సిపాలిటీ పరిధిలో పూర్తిస్థాయి సర్వే చేయిస్తామని రంగనాథ్ అన్నారు. ఔటర్ వరకు చెరువుల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం నిర్ధారణ పూర్తయితే ఆక్రమణలకు సంబంధించి చాలా ఫిర్యాదులు పరిష్కారమవుతాయన్నారు. నాలుగైదు నెలల్లో సైంటిఫిక్ మెథడ్ లో ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

21-01-2025 మంగళవారం ( సక్సెస్ ఫుల్ గా గ్రామసభలు )

తెలంగాణలో గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అసలు గ్రామసభలను పట్టించుకోలేదు. గ్రామాల్లో జనం ఏమనుకుంటున్నారు.. ఏం కోరుకుంటున్నారన్న విషయాలను అస్సలు లెక్కలోకి తీసుకోలేదు. అయితే ప్రజాప్రభుత్వం మాత్రం ఏ పథకాలకైనా లబ్దిదారులను జనం మధ్యే ఎంపిక చేయాలనుకుంది. అందుకే 4 కొత్త పథకాలను జనవరి 26 నుంచి ప్రారంభించాలని డిసైడ్ అయింది. అందులో కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఉన్నాయి. వీటికి లబ్దిదారులను గ్రామసభల ద్వారా గుర్తించి అక్కడే ప్రకటించి డ్రాఫ్ట్ లిస్టులను ఫైనలైజ్ చేశారు. పదేళ్ల తర్వాత తెలంగాణలో గ్రామసభలు జరగడంతో రెస్పాన్స్ భారీగా వచ్చింది.

21-01-2025 మంగళవారం ( తెలంగాణ మీన్స్ బిజినెస్ )

దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో భారత్ పతాకం రెపరెపలాడింది. ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షించేలా ఘనంగా గ్రాండ్ ఇండియా పెవిలియన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు జయంత్ చౌధరి, చిరాగ్ పాశ్వాన్‌తో పాటు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఇందులోనే ఏర్పాటు చేసిన తెలంగాణ మీన్స్ బిజినెస్ థీమ్ పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకుంది.

22-01-2025 బుధవారం ( హైదరాబాద్ నెక్ట్ లెవెల్ )

తెలంగాణ రూపురేఖలు మార్చేలా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరాన్ని నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దడంతో పాటు తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామన్నారు సీఎం. ట్రాఫిక్ రద్దీ లేని నగరాల్లోనే వేగంగా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా సీఐఐ - హీరో మోటార్ కార్ప్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం రేవంత్ పాల్గొని తెలంగాణ రైజింగ్ 2050ని ఆవిష్కరించారు.ghmc పరిధిలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు, డ్రైపోర్ట్ తో మచిలీపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో లింకేజ్, వంద కిలోమీటర్ల పొడవైన మెట్రో లైన్, హైదరాబాద్ కు వెలుపల 360 కిలోమీటర్లతో రీజినల్ రింగ్ రోడ్, ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్‌ను లింక్ చేసేలా రేడియల్ రింగు రోడ్లు, వీటికి అనుబంధంగా రైల్వే లైన్.. ఇలాంటి ఆలోచనలను పారిశ్రామిక వేత్తల ముందు ఉంచారు.

22-01-2025 బుధవారం ( వ్యాపారం- పర్యావరణం )

ఒక ట్రిలియన్ మొక్కలు నాటి ట్రిలియన్ ట్రీ ఉద్యమంలో భాగమవుతానని సీఎం రేవంత్ రెడ్డి దావోస్ వేదికగా వన్ ట్రిలియన్ ట్రీ ఆర్గనైజేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, భవిష్యత్ తరాల మనుగడను సురక్షితంగా మార్చే ప్రయత్నంలో పాలుపంచుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ పెవిలియన్ ను వన్ ట్రిలియన్ ట్రీ ఆర్గనైజేషన్ సభ్యులు సందర్శించి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా తెలంగాణలో చెరువుల సంరక్షణ, అలాగే నెట్ జీరో విధానాలతో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు విషయాలను సీఎం ప్రస్తావించారు.

23-01-2025 గురువారం ( దావోస్ లో తెలంగాణ హిట్ )

దావోస్‌లో పెట్టుబడుల సమీకరణలో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త రికార్డులు నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడుల రికార్డు నమోదు చేసింది. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ఇవే అత్యధిక పెట్టుబడులు కావడం విశేషం. 16 ప్రముఖ కంపెనీలు సుమారు 1.78 లక్షల కోట్లతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ప్రాజెక్టుల వల్ల సుమారు 49,550 ఉద్యోగాలు రాబోతున్నాయి. ఈనెల 23న అమెజాన్, విప్రో, ఇన్ఫోసిస్, బ్లాక్ స్టోన్, ఉర్సా క్లస్టర్స్, అక్షత్ గ్రీన్‌టెక్, టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ వంటి ప్రముఖ సంస్థలతో తెలంగాణ రైజింగ్ టీమ్ చర్చలు జరిపింది. ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యంగా ఐటీ, ఏఐ, ఇంధన రంగాల్లో అంచనాలకు మించి భారీ పెట్టుబడులు తెలంగాణకు వచ్చాయి.

23-01-2025 గురువారం ( కొత్త కొత్తగా పేర్లు )

తెలంగాణ ప్రభుత్వం ఈవారం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కేబినెట్ నిర్ణయం ప్రకారం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్, సింగూరు ప్రాజెక్టుల పేర్లను మార్చింది. రాష్ట్ర నీటి పారుదల శాఖ జనవరి 23న ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డికి గుర్తుగా.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు ఎస్. జైపాల్ రెడ్డి పీఆర్ఎల్ఐ ప్రాజెక్టుగా నామకరణం చేసింది. అటు సింగూరు ప్రాజెక్టుకు మంత్రి దామోదర రాజనర్సింహ తండ్రి, దివంగత కాంగ్రెస్ నాయకుడు రాజనర్సింహ పేరు పెట్టింది. సింగూరు ప్రాజెక్టుకు సిలారపు రాజనర్సింహ ప్రాజెక్టుగా నామకరణం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

23-01-2025 గురువారం ( రుణమాఫీపై ఖుషీ ఖబర్ )

2 లక్షలకు పైగా రుణాలుండి ఇంకా మాఫీ అమలు కానీ రైతులకు మార్చిలో షెడ్యూల్ పెట్టి చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈనెల 23న చెప్పారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన ప్రజాపాలన వార్డు సభలో మాట్లాడారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లలో ఎవరి జోక్యం ఉండదని, అర్హులైన వారందరికీ మంజూరు చేస్తామన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం జరిగేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నామని కూడా చెప్పారు. నో రేషన్ కార్డులు లేవు, రాలేవు అన్న కంప్లైంట్స్ లేకుండా ప్రజా ప్రభుత్వం చూసుకుంటోంది.

24-01-2025 శుక్రవారం ( కొత్త పింఛన్లపై కదలిక )

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం కొత్త పింఛన్ దారులకు గుడ్ న్యూస్ చెప్పింది. త్వరలో అర్హుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా త్వరలో కసరత్తు మొదలు కానుంది. రాష్ట్రవ్యాప్తంగా కొత్త ఆసరా పింఛన్ల కోసం 10 లక్షలకు పైగా దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియపై ఫోకస్ పెట్టింది. ఇప్పటికే ప్రభుత్వం 11 రకాల పింఛన్లు అందిస్తోంది.మొత్తం 42 లక్షల మంది లబ్ది పొందుతున్నారు. పింఛన్ తీసుకుని చనిపోయిన వాళ్ల స్థానంలో కొత్త వారిని చేర్చే అంశంపైనా ఆలోచన చేస్తోంది. కాగా త్వరలో బడ్జెట్ సమావేశాలు జరగనుండడంతో అర్హులను త్వరగా ఎంపిక చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు భావిస్తున్నారు. బడ్జెట్‌లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. ఆ ప్రకారం బడ్జెట్ లో నిధులు కేటాయిస్తే కొత్త పింఛన్లకు రూట్ క్లియర్ అవుతుంది.

24-01-2025 శుక్రవారం ( వినతుల వెల్లువ )

హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణ ఇలాంటి వాటిపై ఫోకస్ గా ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ముందు భారీ వినతుల లిస్ట్ పెట్టింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు మొత్త 55 వేల 652 కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఇందులో మెట్రో రైల్ ఫేజ్ %-% 2కు 24,269 కోట్లు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు 10 వేల కోట్లు, సివరేజీ మాస్టర్ ప్లాన్ కు 17,212 కోట్లు, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్ కు 4,170 కోట్ల ఆర్థిక సహాయం చేయాలన్నారు. అటు తెలంగాణకు 20 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు.తెలంగాణ రాష్ట్రంలో 65 శాతం భూభాగం అర్బన్ ఏరియా కింద ఉందని, గ్రేటర్ హైదరాబాద్ సహా మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈనెల 24న బేగంపేట ఐటీసీ కాకతీయలో అర్బన్ సెక్టార్, పవర్ సెక్టార్?లపై కేంద్ర విద్యుత్, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ ?లాల్ ఖట్టర్ రివ్యూ చేశారు. తెలంగాణను లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్న సీఎం అర్బన్ మొబిలిటీ, మూసీ రివర్ ఫ్రంట్, అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, సివిక్ సర్వీసెస్, భూభారతి చట్టం, మెట్రోపాలిటన్ డెవలప్ ?మెంట్ ప్లాన్ 2050, బిల్డ్ నౌ, టౌన్ ?షిప్ గ్రోత్ సెంటర్స్, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల గురించి సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. దావోస్ లో తెలంగాణకు భారీ పెట్టుబడులు రావడంపై కేంద్రమంత్రి ఖట్టర్.. సీఎం రేవంత్ ను ప్రత్యేకంగా అభినందించారు.

24-01-2025 శుక్రవారం ( గ్రామసభలు సక్సెస్ )

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో నాలుగు పథకాలకు.. కొత్తగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఇప్పటికే వచ్చిన డ్రాఫ్ట్ లిస్టులను గ్రామసభల్లో చూపించారు. జనం మధ్యే లబ్దిదారులను ఎంపిక చేశారు. పేర్లు లేని వారు మళ్లీ అప్లై చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో ఈనెల 21 నుంచి 24 వరకు నాలుగు రోజులుగా చేపట్టిన గ్రామసభల నిర్వహణ శుక్రవారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 12,769 పంచాయతీలు, పురపాలికల్లోని 2,387 వార్డుల పరిధిలో గ్రామసభలు సక్సెస్ ఫుల్ గా నిర్వహించారు.

24-01-2025 శుక్రవారం ( ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీ )

ప్రయాణికుల మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీలో కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామన్నారు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి కూడా బస్సులు కొనుగోలు చేయలేదన్నారు. 3,500 మంది ఉద్యోగులు రిటైర్డ్ అయినా.. ఆర్టీసీలో ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదన్నారు. త్వరలోనే ఖాళీలను గుర్తించి.. డ్రైవర్, కండక్టర్ ఉద్యోగులు భర్తీ చేస్తామన్నారు పొన్నం. స్వశక్తి మహిళా సంఘాల ద్వారా మరో 600 బస్సులను కొంటామన్నారు. హైదరాబాద్ పొల్యూషన్ తగ్గించేందుకు అన్నీ ఈవీ బస్సులే నడుపుతామన్నారు. కార్గో సర్వీసుల్లో రిటైర్డ్ ఉద్యోగులకు ఆసక్తి ఉంటే డిపోల్లో అప్లై చేసుకోవచ్చన్నారు.


25-01-2025 శనివారం ( అర్హులందరికీ రేషన్ కార్డులు )

జనవరి 26 నుంచి అమలు చేయనున్న 4 పథకాలపై సీఎం రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ లో శనివారం సుదీర్ఘంగా సమీక్షించారు. ఎలాంటి సమస్యలు లేకుండా కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా నిధుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్దిదారుల ఎంపిక, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాఫీగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు జరగాలని సూచించారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామన్నారు. చివరి లబ్దిదారు పేరు చేర్చే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

25-01-2025 శనివారం ( ప్రజా పాలనలో ముందడుగు )

ఉస్మానియా హాస్పిటల్ కొత్త భవన నిర్మాణంపై సీఎం రేవంత్ సమీక్షించారు. దీన్ని చాలా ప్రయారిటీగా తీసుకున్నారు. ఇప్పటికే చాలా సందర్భాల్లో ఈ కొత్త హాస్పిటల్ బిల్డింగ్ పై దగ్గరుండి సూచనలు చేశారు. గోషామహల్ పోలీస్ గ్రౌండ్ లో దీన్ని నిర్మించబోతున్నారు. సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అత్యాధునిక వసతులతో అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అటు కీలకమైన మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో సీఎం సమావేశమై.. వేగంగా జరగాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు.

# గజిబిజిగా ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్




న్యూఢిల్లీ,2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్ ను, ఫిబ్రవరి 1న, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సమర్పించబోతున్నారు. ఈ బడ్జెట్ లో, కేంద్ర ప్రభుత్వం, దేశ ఆర్థిక విధానాల బ్లూప్రింట్‌ను వెల్లడిస్తుంది. పన్ను చెల్లింపుదార్లు ఈసారి బడ్జెట్ పై అధిక అంచనాలతో ఉన్నారు. పన్ను రేట్లు, రాయితీలు / మినహాయింపులపై ప్రకటనల కోసం ఎదురు చూస్తున్నారు. పాత ఆదాయ పన్ను విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి ప్రకటించవచ్చన్న చర్చ కూడా జరుగుతోంది. గత కొన్నేళ్లుగా, భారతీయ పన్నుల విధానంలో చాలా కీలక మార్పులు వచ్చాయి. ప్రస్తుతం, మన దేశంలో రెండు ఆదాయ పన్ను వ్యవస్థలు ఉన్నాయి. సంప్రదాయంగా వస్తున్న పాత పన్ను విధానానికి ప్రత్యామ్నాయంగా, 2020లో, కేంద్ర ప్రభుత్వం కొత్త పన్ను విధానాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ డేటా ప్రకారం, ఆదాయ పన్ను పత్రాలు దాఖలు చేస్తున్న వ్యక్తిగత పన్ను చెల్లింపుదార్లలో 73 శాతం మంది కొత్త పన్ను విధానాన్ని అనుసరిస్తున్నారు. ఆదాయ పన్ను చట్టంలో సెక్షన్ 80అ కింద, రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడులను మీ మొత్తం ఆదాయం నుంచి తీసివేయవచ్చు. తద్వారా పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం తగ్గుతుంది. ఉదాహరణకు, మీ ఆదాయం రూ.6 లక్షలు / మీరు రూ. 1.5 లక్షలను 80అ కింద పెట్టుబడి పెడితే, పన్ను పరిధిలోకి వచ్చే మీ ఆదాయం రూ.4.50 లక్షలు అవుతుంది, మీరు పను చెల్లించాల్సిన అవసరం లేదు. వార్షికాదాయం రూ. 6.50 లక్షల వరకు ఉన్నా మీరు పన్ను నుంచి పూర్తి మినహాయింపు పొందవచ్చు. రూ. 5 లక్షల వరకు ఆదాయంపై పన్ను లేదు / సెక్షన్ 80అ కింద రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడిపై మినహాయింపు లభిస్తుంది. అంటే మీ రూ. 6.50 లక్షల ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండదు.పాత పన్ను విధానంలో స్లాబ్ రేట్లు ప్రకారం రూ. 2.50 లక్షల వరకు ఆదాయంపై పూర్తిగా పన్ను మినహాయింపు ఉంది. రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల మధ్య ఆదాయంపై 5 శాతం పన్ను, రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల మధ్య ఆదాయంపై 20శాతం పన్ను, రూ. 10 లక్షల కంటే ఎక్కువ ఆదాయంపై 30శాతం పన్ను, సీనియర్ సిటిజన్ (60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు) కొన్ని అదనపు తగ్గింపులు పొందవచ్చు. పాత పన్ను విధానంలో, మీ ఖర్చులను లెక్కించడంలో మీకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. మీ ఆదాయాన్ని ప్లాన్ ప్రకారం ఖర్చు చేస్తే, పన్ను ఆదా చేయడానికి అనేక అవకాశాలు ఉన్నాయి. కానీ ఇది సంక్లిష్టమైన ప్రక్రియ / అందరికీ సులంభంగా అర్థం కాదు. కొత్త వ్యవస్థలో పన్ను దాఖలు చేయడం సులభం. ఇందులో మీరు ఎలాంటి పెట్టుబడి లేదా వ్యయానికి సంబంధించిన లెక్కలు సమర్పించాల్సిన అవసరం లేదు. పాత విధానంలో, మీ పెట్టుబడులు / ఖర్చుల వివరాలు ఇవ్వాలి, ఇది కొంచెం గజిబిజిగా ఉంటుంది. పన్ను రేట్లు - పాత విధానంలో, పన్ను రేట్లు కొంచెం ఎక్కువగా ఉ

# ఆగమేఘాల మీద బైరటీస్ గనుల కేటాయింపు

అమరావతి, వైకాపా అధినేత, మాజీ సీఎం జగన్ బంధువు వెంకటరెడ్డికి బైరైటీస్ గనుల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రస్తుత గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ జనవరి 29 నుంచి ఫిబ్రవరి 14 వరకు సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో గనుల శాఖ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం.. జీఏడీ కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనాకు అప్పగించింది. ఏపీ ఎండీసీ ఎండీ బాధ్యతలను కూడా ముఖేష్ కుమార్ మీనాకు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జగన్‌కు వరుసకు సోదరుడు, పులివెందులకు చెందిన వైఎస్ వెంకటరెడ్డికి.. సంక్రాంతి పండుగ సమయంలో లీజు రూపంలో రాష్ట్ర గనుల శాఖ భారీ కానుక ఇచ్చింది. వైఎస్సార్ జిల్లా వేములలో దాదాపు రూ.100 కోట్లకు పైగా విలువైన ముగ్గురాయి (బెరైటీస్) నిల్వలున్న లీజును కట్టబెట్టింది. సెలవు రోజుల్లో, ఈనెల 15న కనుమ పండుగ నాడు లీజు కేటాయిస్తూ గనులశాఖ ఉత్తర్వులిచ్చింది. ఈ్గ ÷లు ఆగమేఘాలపై కదలడం వెనుక వైఎస్సార్ జిల్లాకు చెందిన తెదేపా ముఖ్యనేత ఒకరి సహకారం ఉన్నట్లు సమాచారం. వేములలో సర్వే నంబర్లు 1021/26, 43ల్లో 11.6 హెక్టార్లలో ముగ్గురాయి ఖనిజ లీజుకు వెంకటరెడ్డి 2016లో దరఖాస్తు చేసుకున్నారు. వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ దస్త్రం వేగంగా కదిలింది. 9.55 హెక్టార్లలో ముగ్గురాయి లీజుకు గనులశాఖ ఎర్రగుంట్ల సహాయ సంచాలకులు 2020 మార్చిలో ప్రతిపాదన పంపారు. గనులశాఖ అప్పటి సంచాలకుడు వీజీ వెంకటరెడ్డి ఈ లీజ్గు ÷ల్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపారు. తాజాగా వైఎస్ వెంకటరెడ్డికి 9.55 హెక్టార్లలో 20 ఏళ్ల కాల వ్యవధితో లీజు మంజూరుచేస్తూ ఈనెల 15న డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వు జారీచేశారు.

# ఈటలలకు ఎర్త్ పెడుతున్న బండి...



హైదరాబాద్,తెలంగాణ బీజేపీలో అంతర్యుద్ధం పతాకస్థాయిలో కొనసాగుతోంది. నేడో రేపో పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమిస్తారనగా ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ చేస్తున్న కామెంట్స్ ఆసక్తి రేపుతున్నాయి. కాబోయే ప్రెసిడెంట్ ను ఉద్దేశించే మాజీ ప్రెసిడెంట్ ఈ డైలాగ్స్ పేల్చుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.టీ.బీజేపీలో చాలా కాలంగా కోల్డ్ వార్ జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇవి కాస్త తగ్గినట్లు అనిపించినా, ఇటీవల కాలంలో మళ్లీ మొదలయ్యాయనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా పార్టీ అధ్యక్ష పీఠం ఆశిస్తున్న సీనియర్ నేత ఈటల దూకుడు మీద ఉండటం ఆయన వ్యతిరేక వర్గానికి రుచించడం లేదని అంటున్నారు. మూడేళ్ల క్రితం బీఆర్ఎస్ నుంచి బీజేపీకి వచ్చిన ఈటల ప్రస్తుతం మల్కాజిగిరి ఎంపీగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర బీజేపీకి అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారని చెబుతున్నారు. అయితే ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ ఉన్నవారికే పార్టీ సారథ్యం అప్పగించాలని టీ.బీజేపీలో ఓ వర్గం డిమాండ్ చేస్తోందంటున్నారు.ముఖ్యంగా పార్టీ మాజీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న కామెంట్స్ హీట్ పుట్టిస్తున్నాయి. పద్మ అవార్డులు సందర్భంగా ప్రజా యుద్ధనౌక గద్దరును ఉద్దేశించి బండి చేసిన కామెంట్స్ ఆసక్తి రేపుతున్నాయి. గద్దరుకు పద్మా అవార్డు ఇవ్వాలనే డిమాండ్ పై స్పందించిన కేంద్ర మంత్రి బండి కమ్యూనిస్టు నేపథ్యం ఉన్నవారికి అవార్డులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీంతో ఆయన పరోక్షంగా ఈటలకు పదవిపైనా ప్రశ్నించినట్లైంది.బీఆర్ఎస్లో చేరకముందు ఈటలకు కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు ఉండేవి. ఆ నేపథ్యంతోనే ఆయన తెలంగాణ ఉద్యమంలోకి వచ్చి ఆ తర్వాత అప్పటి టీఆర్ఎస్ ఇప్పటి బీఆర్ఎస్ తో రాజకీయాలు కొనసాగించారు. దాదాపు 8 ఏళ్లు మంత్రిగా పనిచేశారు. అయితే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో విభేదాల కారణంగా ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. బీజేపీలో చేరిన నుంచి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు దీటుగా ఎదగాలనే లక్ష్యం పెట్టుకున్నారు.అయితే ఈటల ప్రయత్నాలకు బీజేపీలో కొందరు అడ్డుగా నిలుస్తువచ్చారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా 2023కి ముందు బీజేపీ సారథిగా పనిచేసిన ప్రస్తుత కేంద్రమంత్రి బండి సంజయ్ తెలంగాణలో కమలం పార్టీకి ఊపు తెచ్చారు. అయితే ఈటల బీజేపీలో జాయిన్ అయిన తర్వాత బండి కథ వేరేలా మారిందని చెబుతారు. దీంతో ఎన్నికల ముందు బండిని పార్టీ సారథ్యం నుంచి తప్పించారు. దీంతో ఇద్దరి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయనే ప్రచారం ఉంది. ఇప్పటికీ కూడా ఇద్దరు నేతల మధ్యే అవే విభేదాలు కొనసాగుతున్నాయని బీజేపీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతోనే ఈటలకు ఎర్త్ పెట్టేలా కేంద్ర మంత్రి సంజయ్ పరోక్ష విమర్శలు గుప్పిస్తున్నారని టాక్ వినిపిస్తోంది.కమ్యూనిస్టులకు అవార్డులే ఇవ్వొద్దనే వాతావరణం ఉంటే పార్టీ అధ్యక్ష పదవి ఎలా ఇస్తారనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. ఇదే సమయంలో ఈటల స్థానంలో తెలంగాణకు చెందిన ఆర్ఎస్ఎస్ తో బలమైన బంధం ఉన్న ఓ తెలంగాణ నేత తన అనుచరుడికి బీజేపీ అధ్యక్ష పదవి ఇప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు. దీనికి బండి సహకారం కూడా ఉందని ఆ పార్టీలో చర్చించుకుంటున్నారు. మొత్తానికి కాషాయ దళపతి ఎవరవుతారన్నది ఆసక్తికరంగా మారింది.

# తులం బంగారానికి ఆశపడి ఓటేశారు..



హైదరాబాద్, మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్ మాట్లాడారు. రాబోయే రోజుల్లో విజయం మనదే అని.. మనం విజయం తెలంగాణ విజయం కావాలని.. ఆయన అన్నారు. ఫిబ్రవరి చివర్లో భారీ బహిరంగ సభ నిర్వహిద్దామని కేసీఆర్ అన్నారు. ప్రజలంతా తరలి రావాలని పిలుపునిచ్చారు.'ఇక లాభం లేదు. ప్రత్యక్ష పోరాటాలే చేద్దాం. కాంగ్రెస్ పరిపాలనలో రైతుబంధుకు రామ్ రామ్ చెప్పేశారు. దళిత బందుకు జై భీమ్ చెప్పేశారు. తులం బంగారం ఏమైంది..? కాంగ్రెస్ పాలనపై రాష్ట్రమంతటా అసంతృప్తి వ్యక్తం అవుతుంది. అన్ని వర్గాలను ముంచిన పార్టీ కాంగ్రెస్ పార్టీ. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మళ్ళీ కరెంటు కోతలు కనబడుతున్నాయి. తులం బంగారం కోసం ఆశపడి ఓటేశారు. ఇప్పుడేమో ఇబ్బంది పడుతున్నారు. కాంగ్రెస్ పాలనపై దండయాత్ర చేద్దాం' అని కేసీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.త్వరలోనే భారీ సభ పెట్టుకుందామని పార్టీ శ్రేణులకు సీఎం కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ దివాలా తీయించిందని విమర్శించారు. భూముల ధరలు అమాంతం పడిపోయాయని అన్నారు. మాట్లాడితే ఫామ్ హౌస్, ఫామ్ హౌస్ అంటున్నారు.. అసలు ఫాంహౌస్‌లో పంటల తప్ప ఏం పండుతాయి అని ప్రశ్నించారు. నిన్న కాంగ్రెస్ వాళ్ళు పోలింగ్ పెడితే వారి పార్టీకే వ్యతిరేకంగా ఎక్కువ ఓట్లు వచ్చాయని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేక గాలివీస్తుందని.. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు ఎవరు సంతోషంగా లేరని కేసీఆర్ వ్యాఖ్యానించారు.'నేను ఎంత చెప్పినా ప్రజలు వినలేదు. అత్యాశ పడి కాంగ్రెస్ వాళ్లకు ఓటేశారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసింది. తెలంగాణలో ఉన్న ప్రతి బిడ్డ మనోడే.. అన్ని మబ్బుల తొలిగిపోయి ఇప్పుడు నిజాలు బయటకు వస్తున్నాయి. మంచేదో.. చెడు ఏదో ప్రజలకు ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. కాంగ్రెస్ పాలనపై అంతటా అసంతృప్తే ఉంది' అని కేసీఆర్ అన్నారు. 'తెలంగాణలో ఏ ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు కావడం లేదు. అన్ని పథకాలు గంగలో కలిసిపోయాయి. కరోనా లాంటి మహమ్మారి వచ్చిన కూడా నేను రైతు బంధు ఆపలేదు. రైతు భీమా వల్ల ఎంతోమంది రైతులకు సహాయం జరిగింది. కైలాసం ఆడంగా పెద్ద పాము మింగినట్లు అయ్యింది తెలంగాణ ప్రజల పని. మళ్ళీ కరెంట్ కోతలు.. మంచి నీళ్ల కరువు వచ్చాయి..ఇది ఏంది అని అడిగితే పోలీసులతో కేసులు పెట్టిస్తున్నారు. ఆలోచన లేకుండా ఎవరో ఏదో చెబితే నమ్మి ఓట్లు వేస్తే ఏమైతదో తెలంగాణ ప్రజలకు మంచి గుణపాఠం అయ్యింది' అని కేసీఆర్ పేర్కొన్నారు.గురుకులాల్లో అన్ని సమస్యలే.. ఎన్నో ఇబ్బందులు పడుతూ విద్యార్థులు హస్టల్ వసతుల నుంచి వెళ్లిపోతున్నారు. పిల్లల తల్లిదండ్రులు బాధపడుతున్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకం టెండర్లు ఎందుకు పిలవరు. వాటిని అడ్డుకోవడంలో మతలాబు ఏంటి.. సంగమేశ్వర,బసవేశ్వర ఎత్తిపోతల పథకం గురించి హరీష్ రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న రైతులతో నిరసన కార్యక్రమం చేయాలి. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం ముస్లింలను వాడుకుంది కానీ వారికి ఏమి చేయలేదు' అని కేసీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు కేసీఆర్ చాలారోజుల తర్వాత బయటకొచ్చి మాట్లాడారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో ఏక్ నిరంజన్... ఒకే ఒక్కడు...!



హైదరాబాద్,తెలంగాణలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ఎట్టకేలకు అధికారంలోకి వచ్చింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఇక గత సెప్టెంబర్ లో తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడుగా మహేష్ గౌడ్ ను పార్టీ అధిష్టానం నియమించింది. అయితే అప్పటినుంచి ఇప్పటివరకు అంతా ఏక నిరంజన్ ఒకే ఒక్కడు అన్నట్టుగా ఉందే తప్ప పార్టీలో ఎవరికీ ప్రాధాన్యత లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మహేష్ గౌడ్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేయలేదు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు ఎప్పుడు ఇన్ని రోజులపాటు పీసీసీ కార్యవర్గం లేకుండా పార్టీ నడవలేదు అన్న చర్చ జరుగుతోంది. గాంధీభవన్ వర్గాలలో గతంలో రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్లు.. ప్రధాన కార్యదర్శులు.. ప్రచార కమిటీ చైర్మన్ లను కూడా ఒకేసారి ప్రకటించారు. ఎన్నికలవేళ అప్పుడు అలా ప్రకటన చేసినట్టు పార్టీ హైకమండ్ చెప్పుకున్నా ఇప్పుడు అధికారంలో ఉండి కనీసం పూర్తిస్థాయిలో కమిటీ వేసుకోలేని వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.మహేష్ గౌడ్ కూడా పార్టీ విస్తృతస్థాయి కమిటీ ఏర్పాటు చేయడానికి కసరత్తులు మొదలుపెట్టారట. అయితే అధిష్టానం నుంచి కమిటీ నియమకానికి సంబంధించి ఎప్పటి వరకు ఎలాంటి దశాదిశా లేదని తెలుస్తోంది. ఇటీవల పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలోనూ ఇదే అంశంపై పార్టీ వర్గాల మధ్య విస్తృతమైన చర్చి జరిగినట్లు తెలిసింది. కమిటీ ఏర్పాటుకు సంబంధించి కసరతులు చేయాలని కేసి వేణుగోపాల్ సూచనలు చేశారని సమాచారం. ఈ సమావేశం జరిగి చాలా రోజులు అయినా కూడా ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు పడుతున్న సందర్భాలు లేవు. అటు ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు రాక.. ఇటు పార్టీలో పదవులు లేక చాలామంది అసంతృప్తితో రగిలిపోతున్నారు.ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిస్థాయి క్యాబినెట్ ఏర్పాటు చేసుకోవాలని పరిస్థితి పిసిసి అధ్యక్షుడిని నియమించి ఆరు నెలలు అవుతున్నా పూర్తి స్థాయిలో కమిటీ ఎందుకు వేసుకోవటం లేదు అన్నది ఎవరికీ అంతుపడటం లేదు. పదవుల కోసం చాలామంది నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పైగా 10 ఏళ్లపాటు ఎన్నో అష్ట కష్టాలు పడి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన వాళ్లకు ఎప్పటికీ అటు ప్రభుత్వంలోనూ ఇటు పార్టీ పరంగా ఎలాంటి పదవులు లేవు. దీంతో వీరంతా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. పదవులు ఆశించే వారి సంఖ్య చాలా ఎక్కువగానే ఉంది. కొందరికి ప్రభుత్వంలో మరికొందరికి పార్టీలో అవకాశం ఇస్తే బాగుంటుంది.ఇప్పటిదాకా ఏది జరగకపోవడంతో అంతా అయోమయం గందరగోళం మారింది. ఇటు పిసిసి అధ్యక్షుడికి కూడా తన టీం లేకపోతే చేయి విరిగినంత పని అవుతుందట. అన్ని పనులు ఆయనే చక్కపెట్టుకోలేని పరిస్థితి.. వెంటనే ఉపాధ్యక్షులను నియమించుకుంటే ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పార్టీ పరంగా ఏం జరుగుతుందో తెలిసిపోతుంది. ఇప్పుడు అలాంటి వ్యవస్థ లేక కట్టుతప్పుతోందన్న వాదన బలపడుతుంది. పదవులు లేక పనిచేయటానికి ఎవరు ముందుకురాని పరిస్థితి. ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్న ఇంకా ఏం లేదంటూ కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం కళ్ళు తెరవకపోతే పార్టీ మరింతగా నష్టపోవడం ఖాయం.

# ట్యాక్స్ ఫ్రీ రాష్ట్రంగా సిక్కిం..అక్కడ ఆదాయపు పన్ను వర్తించదు




న్యూఢిల్లీ, రాబోయే కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పన్ను కూడా ఒక అంశం కావడంతో దీనిపై ఎలాంటి నిర్ణయాలు ఉంటాయన్న దానిపై ఉద్యోగుల్లో ఏటా ఆశలు ఉంటాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. టాక్స్ శ్లాబ్‌లు, మినహాయింపులపై ఎలాంటి ప్రకటన వస్తుందోనని ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. అయితే, ఆదాయ పన్ను గురించి పట్టింపే లేని రాష్ట్రం మన దేశంలోనే ఒకటి ఉంది. ఎందుకంటే, ఆ రాష్ట్రంలో ఆదాయ పన్ను 100శాతం రద్దయింది. ఆ రాష్ట్రం.. 'సిక్కిం' ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ వరుసగా ఎనిమిదో బ్జడెట్ సమర్పణకు సిద్ధమయ్యారు, ఫిబ్రవరి 01 శనివారం రోజున కేంద్ర బ్జడెట్ 2025ను సమర్పిస్తారు. ఈ నేపథ్యంలో, భారతదేశంలోని ఏకైక పన్ను రహిత రాష్ట్రమైన సిక్కిం ఇప్పుడు హెడ్‌లైన్స్‌లోకి వచ్చింది. ఆదాయ పన్ను చట్టంలోని ఆర్టికల్ 371(ఈ) కింద, సిక్కిం నివాసితులు పూర్తి ఆదాయ పన్ను మినహాయింపును పొందుతారు. 1975లో, ఇండియన్ యూనియన్‌లో సిక్కిం రాష్ట్రం విలీనమైన సమయంలో, భారత ప్రభుత్వంతో ఈ రాష్ట్రం ప్రత్యేక ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం ప్రకారం సిక్కిం ప్రజలకు పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు లభించింది. ఈ ప్రత్యేక హక్కు అక్కడి ప్రజల ఆదాయాన్ని పెంచుతోంది .. పెట్టుబడులను ఆకర్షిస్తోంది. భారతదేశంలోని మిగిలిన ప్రాంతాల మాదిరిగా కాకుండా, సిక్కిం నివాసితులు ఆదాయ పన్ను నుంచి 100 శాతం మినహాయింపు పొందారు, రూ.కోట్ల సంపాదించినా ఒక్క రూపాయి కూడా పన్ను కట్టక్కరలేదు. ఈ పన్ను రహిత ప్రత్యేకత సిక్కిం ఆర్థిక వృద్ధిని వడివడిగా నడిపిస్తోంది. పర్యాటకం, వ్యవసాయం / చిన్న వ్యాపారాలకు ప్రయోజనం చేకూరుస్తోంది. సిక్కిం సబ్జెక్ట్స్ రెగ్యులేషన్ 1961 కింద 'సిక్కిమిస్' గా గుర్తింపు పొందిన అందరు వ్యక్తులు.. తాము సంపాదించే వడ్డీ రాబడి, డివిడెండ్‌లతో సహ ప్రతి రూపాయి ఆదాయంపైనా పూర్తి పన్ను మినహాయింపు పొందుతారు. సిక్కిం ప్రజలకు లభించే ఈ ప్రత్యేక హక్కుకు భద్రత కూడా కల్పించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 (ఈ) / ఆదాయ పన్ను చట్టం 1961లోని సెక్షన్ 10 ద్వారా ఈ మినహాయింపునకు రక్షణ ఏర్పాటు చేశారు. భారతదేశంలోని మిగిలిన ప్రాంతాల ప్రజలు ఒక పరిమితిని దాఖలు చేయడానికి, సాధారణంగా, జులై 31 చివరి తేదీగా ఉంటుంది. అయితే, సిక్కిం నివాసితుల ఆదాయం రూ.కోట్లకు చేరుకున్నప్పటికీ వాళ్లకు ఇన్‌కమ్ టాక్స్ రూల్స్ వర్తించవు. కాబట్టి, సిక్కిం నివాసితులు ఆదాయ పన్ను పత్రాలను కూడా సమర్పించాల్సిన అవసరం లేదు, ఐటి దాఖలు నుంచి మినహాయింపు పొందారు. ఆదాయ పన్ను చెల్లింపు మినహాయింపు మాత్రమే కాదు.. మార్కెట్ రెగ్యులేటర్ 'సెబీ', సిక్కిం నివాసితులకు పాన్ కార్డ్ అంశంలోనూ ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. భారతదేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలు షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టాలంటే పాన్ కార్డ్ కచ్చితంగా అవసరం. ఈ విషయంలో సిక్కిం ప్రజలకు మినహాయింపు ఉంది. వాళ్లు పాన్ కార్డ్ లేకుండా కూడా స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు.

# కెసీఆర్ ఫామ్‌హౌజ్ వీడి అసెంబ్లీకి రావాలి



హైదరాబాద్,కేసీఆర్ గర్జనలు, గంభీరాలు గమనిస్తున్నామని మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఫామ్ హౌస్‌లోనే ఉండి మాట్లాడతారా.. లేక అసెంబ్లీకి వస్తారా అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. అసెంబ్లీకి రాకుండా ఎక్కడికి పోతాడో చూద్దామని అన్నారు. అసెంబ్లీకి వస్తే అప్పుడు మాట్లాడతామని అన్నారు. శుక్రవారం తెలంగాణ సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ ఏడాది కాలంలో నల్గొండ, కరీంనగర్ బీఆర్ఎస్ సభల్లో కూడా.. ఈరోజు మాదిరిగానే గంభీర ప్రకటనలే చేశారు. ఆ తర్వాత ఏమయ్యారో అందరికీ తెలిసిందేనని అన్నారు.ప్రతిపక్షనేతగా అసెంబ్లీ ముఖం చూడని వ్యక్తి తన ఉనికిని చాటుకోవడానికి, తానున్నానని చెప్పుకోవడానికి తుపాకీ రాముడిలా, పిట్టల దొర మాదిరి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.13 నెలల పాటు ఫామ్ హౌస్‌కే పరిమితమై ఇంతకాలం మౌనంగా ఉన్నానని ఇప్పుడేదో అంటే సరిపోదన్నారు. ప్రతిపక్ష నాయకుడంటే ప్రజల్లో తిరగాలని చెప్పారు. ప్రజా సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించాలని అన్నారు. వర్షాలు వచ్చినా.. వరదలు వచ్చినా కనీసం ప్రజలను పరామర్శించలేదని.. ఫామ్ హౌస్ దాటలేదని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి కూడా రాలేదని గుర్తుచేశారు. ప్రతిపక్ష నేతగా ఏడాది నుంచి అసెంబ్లీకి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ప్రజల్లోకి రాలేదని చెప్పారు. కేసీఆర్ జీవితమంతా ఫామ్ హౌసే అని విమర్శించారు. ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్ కు ఓటేశారని కేసీఆర్ వ్యాఖ్యలు నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. ప్రజా తీర్పును అగౌరవ పరుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలన్నా.. ప్రజాతీర్పు అన్నా కేసీఆర్‌కు ఏనాడూ గౌరవం లేదని చెప్పారు. పదేళ్లు అధికారం ఇచ్చిన ప్రజలకు ఓడిపోయిన తర్వాత ఈ రోజు వరకు కూడా కనీసం కృతజ్ఞత తెలపలేదని చెప్పారు. ప్రజాతీర్పును శిరసావహిస్తున్నామని కూడా ప్రకటించలేదని మండిపడ్డారు. 'ప్రజలు ఏదో నమ్మి ఓటేశారని అంటున్నావు. వాస్తవాలు గ్రహించి నీ గడీల పాలన వద్దనుకుని ప్రజలు నిన్ను నీ కుటుంబాన్ని ఛీత్కరించారు. పథకాలు అమలు కాలేదని ఫామ్ హౌజ్‌లో కూర్చొని మాట్లాడటం కాదు. ఇప్పటికైనా ప్రజల్లోకి రావాలనే మేమంటున్నాం. అసెంబ్లీ సమావేశాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదే పదే ఆహ్వానించారు. 80 వేల పుస్తకాలు చదివినారన్నారు. మీ అమూల్యమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని అసెంబ్లీకి రమ్మంటే ఎందుకు రాలేదు. 2020 రెవెన్యూ చట్టం దేశానికే ఆదర్శమని ప్రకటించిన మీరు భూ భారతి చట్టం ప్రవేశ పెట్టిననాడైన అస్సెంబ్లీకి వస్తారని ఆశించాం. నీ ఫామ్ హౌజ్‌కు కరెంటు కోతలెక్కడివి. లెక్కలు తీద్దామా. ఏ రోజు ఎంత కరెంటు సరఫరా అయింది. ఎంత సరఫరా అవుతుంది. నీ ఫామ్ హౌజ్‌కు నీ÷–లళెక్కడివి. రైతు భరోసా ఇచ్చిందే మేము. రాష్ట్రంలో ఉచిత కరెంట్ తెచ్చిందే కాంగ్రెస్. చరిత్ర ప్రజలకు తెలియదా. నీవంటున్న గురుకులాలను సందర్శిద్దామా. మాతో వస్తారా. నీవెక్కడికంటే అక్కడికి రావడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అదె గదుల్లో పెట్టి విద్యార్థులను నానా ఇబ్బందులకు గురిచేసిన మీరా మాట్లాడేది. రైతుల రుణమాఫీ కోసం రూ.20 వేల కోట్లు ఇచ్చిన సంగతి కళ్లకు కనిపించడం లేదా..? అభివృద్ధి మీద చర్చకు సిద్ధమా..? ఏదైనా మాట్లాడితే దానికొక ప్రాతిపదిక ఉండాలి. ముస్లింలను కాంగ్రెస్ వాడుకుంది అంటున్నావు. వాడుకుని వదిలేసే చరిత్ర కేసీఆర్‌ది' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు.

## అధికారంలోకి వచ్చాకా తడాఖా చూపిస్తాం

రాయచోటి, వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు.. అప్పుడు తెదేపా కార్యకర్తల భరతం పడతామని మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హెచ్చరించారు. కడప, రాయచోటిలో వైకాపా సమన్వయ సమావేశానికి హాజరైన పెద్దిరెడ్డి.. తెదేపా కార్యకర్తలను బెదిరించే విధంగా బహిరంగ వ్యాఖ్యలు చేశారు. 'వైకాపా నాయకులు, కార్యకర్తలను కూటమి ప్రభుత్వం కేసులు పెట్టి ఇబ్బంది పెడుతోంది. సోషల్ మీడియా కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారు. గ్రామస్థాయిలో కూడా మన కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ సీఎం అవుతారు. అప్పుడు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల భరతం పడతాం.

# ఎమ్మెల్సీ వర్మ... ఎంతో దూరం లేదా ?



అమరావతి,గోదావరి జిల్లాలో కీలక నియోజకవర్గం అయిన పిఠాపురాన్ని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా చేసి ఏడాదిలో మూడు వందల అరవై రోజులూ పార్టీ కోసం పనిచేసే నేతగా టీడీపీ ఇంచార్జ్ ఎస్వీఎస్ఎన్ వర్మకు పేరు ఉంది. ఆయన 2009 నుంచి వరసగా పోటీ చేస్తూ వచ్చారు. మధ్యలో 2014లో ఇండిపెండెంట్ గా తొలిసారి గెలిచి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ ఎన్నికల్లో ఆయన భారీ మెజారిటీని సాధించారు.ఇక 2024లో పిఠాపురం నుంచి పోటీ చేసి గెలవాలని వర్మ అయిదేళ్ళూ కష్టపడి పనిచేశారు. కానీ జనసేనకు ఆ సీటు పొత్తులో భాగంగా వెళ్ళడం, చివరి నిముషంలో ఏకంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీకి దిగడంతో వర్మకు భారీ షాక్ తగిలింది. ఆయన ఒక దశలో క్యాడర్ మాట విని ఇండిపెండెంట్ గా పోటీకి రెడీ అయిపోయారు.అయితే టీడీపీ అధినాయకత్వం ఆయనను బుజ్జగించడంతో వెనక్కి తగ్గారు. మొత్తానికి ఆయన పవన్ కళ్యాణ్ గెలుపునకు మనస్ఫూర్తిగా పనిచేసి భారీ మెజారిటీ దక్కడానికి ఎంతో కృషి చేశారు. ఇక ఆయనకు టీడీపీ హైకమాండ్ నుంచి అపుడు భారీ హామీ దక్కిందని ప్రచారంలో ఉంది. తొలి నామినేటెడ్ పదవి వర్మకే అన్ భరోసా ఇచ్చారని కూడా చెప్పుకున్నారు.అయితే గడచిన ఎనిమిది నెలలలో చాలా ఎమ్మెల్సీ పదవులు భర్తీ అయిపోయాయి. కానీ వర్మ విషయం అలాగే ఉండిపోయింది. ఆయన అనుచరులు అభిమానులలో అయితే నిరాశ పడుతున్నారు. తమ నాయకుడికి నామినేటెడ్ పదవి ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఇక వర్మ అయితే అనేకసార్లు చంద్రబాబు లోకేష్ బాబులను కలసి వచ్చారు.మరి ఇపుడు చూస్తే గోదావరి జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటుకి ఎన్నికలు వచ్చాయి. ఈ కీలక సమయంలో వర్మకు ఈ సీటు కేటాయించాలని కూడా ఒక డిమాండ్ అయితే ఉంది. ఇపుడున్న పరిస్థితుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా బాజాభజంత్రీలతో భారీ మెజారిటీతో గెలుస్తారు. పైగా ఆరేళ్ళ పాటు పెద్దల సభలో ఉంటారు.మరి ఈ పదవికి కూటమి అభ్యర్థిగా వర్మ పేరుని ప్రకటిస్తే సహేతుకంగానూ సమంజసంగానూ ఉంటుందని అంటున్నారు. అంతే కాదు పార్టీ కోసం పనిచేసిన వారికి న్యాయం దక్కిందని అంతా భావిస్తారు అని అంటున్నారు. వర్మకు ఈసారి అయినా చాన్స్ ఇస్తారా ఆయన రాజకీయ అదృష్టాన్ని మలుపు తిప్పుతారా అన్నది మాత్రం పిఠాపురంలో పెద్ద ఎత్తున చర్చగా ఉంది.అయితే పట్టభద్రుల సీటుకు అభ్యర్థి ఖరారు అయిపోయారని అంటున్నారు. చాలా కాలం క్రితమే పట్టభద్రులను చేర్పించుకుని పక్కాగా గెలిచే వ్యూహాలను అమలు చేసుకుంటూ పోతున్నారని కూడా చెబుతున్నారు. వర్మ విషయంలో అయితే కచ్చితంగా ఎమ్మెల్సీ పదవి ఇస్తారని అని అంటున్నారు.ఎమ్మెల్సీ పదవులు పది దాకా మార్చి నెలాఖరులో ఖాళీ అవుతున్నాయని అందులో ఒక దానికి వర్మకే రిజర్వ్ చేశారని గట్టిగా రెండు నెలలు కూడా లేదని వర్మ ఎమ్మెల్సీ కావడం ఖాయమని కూడా అంటున్నారు. ఏది ఏమైనా పిఠాపురం వర్మకు పదవి ఇస్తే తమకు దక్కినట్లుగానే భావించాలని చాలా మంది అనుకుంటున్నారు. మరి ఎమ్మెల్సీ వర్మ అని పిలిచే రోజు ముందుందా అది ఎపుడు వస్తుంది అన్నది చర్చగానే ఉంది. చూడాలి మరి ఆ లక్కీ చాన్స్ వర్మ గారికి ఎపుడో.

## టీటీడీ అన్న ప్రసాదానికి రూ. కోటి విరాళం

అమరావతి,తిరుమల వేంకటేశ్వరస్వామికి చెన్నైకి చెందిన ఓ భక్తుడు భారీ విరాళాన్ని అందజేశారు. సెన్సార్ క్యాపిటల్ కంపెనీ ఎండీ, సీఈవో వెంకటేష్ కన్నపన్ టీటీడ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ. కోటి డీడీని శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి శుక్రవారం అందజేశారు. జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడిన భక్తురాలికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పరిహారాన్ని అందించారు. కడప జిల్లా వీరపునాయనపల్లి మండలం, సర్వరాజుపేట కాలనీకి చెందిన బాధితురాలు జి. శైలజ గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com